ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9440897445, 8074636674

ఆదివారం 21 జూన్ 2026 | Sunday 21 June 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 80 | Vol.No 28 Issue No .80 | www.visionandhra.in

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినోత్సవం

**ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు**



అమరావతి,జూన్20 : శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే మిగతా2లో..

## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

- ఎలాంటి ఒత్తిడికి గురికావద్దన్న సిఎం రేవంత్
- నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు



హైదరాబాద్,జూన్20 : నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని మిగతా2లో..

## తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్

- తెలంగాణ సాధనే శ్వాసగా జీవించిన సార్
- వర్ధంతి సందర్భంగా త్యాగం, కృషిని గుర్తు చేసిన సిఎం రేవంత్



హైదరాబాద్,జూన్ 20 : తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికులు ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని, కృషిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా ఆయన జీవితాన్ని గడిపారని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుడి త్యాగాన్ని తెలంగాణ సమాజం, ప్రజా ప్రభుత్వం సదా గుర్తుంచుకుంటుందని తెలిపారు. ఆ మహనీయుడి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు కోసం ప్రజా ప్రభుత్వం మిగతా2లో..

## ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన



భువనేశ్వర్,జూన్20 : ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం మిగతా2లో..

## పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

- ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక
- పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం
- వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి
- వ్యాధి చికిత్స కంటే నివారణె మిన్న
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,జూన్20 : ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర మిగతా2లో..

## బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

- బాలలహక్కుల పరిరక్షణ కమిటీ కృషి చేయాలి,
- సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క సూచన



హైదరాబాద్,జూన్20 :తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా మిగతా2లో..

## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

- రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ
- హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



కోల్‌కతా,జూన్20 : పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. మిగతా2లో..

## నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

- మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్
- ఖంగుతిన్న, ఎటిఎకు సమాచారం ఇచ్చిన విద్యార్థి
- పొరపాటును సవరించి, కొత్త కేంద్రం అలాట్‌కు హామీ

న్యూఢిల్లీ,జూన్20 : నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను మిగతా2లో..

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

**- వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు**



హైదరాబాద్,జూన్ 20 :కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు మిగతా2లో..

## మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

- 22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానన్న సిఎం
- వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
- కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సిఎం రేవంత్



హైదరాబాద్, జూన్20 : హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. మిగతా2లో..

## హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

- లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం
- హైడ్రాపై దుష్ప్రచారం తగదు
- మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్,జూన్20 : హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ మిగతా2లో..


## ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

- ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు
- చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు
- ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్,జూన్20 : తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక పక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే పక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్ అయిన వారికి ఫాం మిగతా2లో..

## దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్
- ఉండవల్ల గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ
- బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు
- చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్



అమరావతి,జూన్20 : దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా మిగతా2లో..

## ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం

- రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది
- 48 గంటల్లో ధాన్యం కొనుగోలు మొత్తాన్ని జమచేస్తున్నాం
- రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలి
- ఆంధ్రాను మించి తెలంగాణ ధాన్యం పండిస్తోంది
- వైకాపా హయాంలో రైతులు నానా కష్టాలు పడ్డారు
- లింగగుట్లో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల
- రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన చంద్రబాబు



పల్నాడు,జూన్20 : రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. దాన్ని నిలబెట్టుకున్నా మని సీఎం చంద్రబాబు అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మిగతా2లో..

## ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా ప్రక్షాళన జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే సర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మ జన్మదినోత్సవం

విషెస్ తెలియజేశారు. దేశానికి ద్రౌపది ముర్ము అందిస్తున్న సేవల్లో విజయం సాధించాలని సీఎం ఆకాంక్షించగా, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్ము నిజమైన స్ఫూర్తిదాయకమని పవన్ అన్నారు. 'భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జన్మదిన శుభాకాంక్షలు. ఆమె జీవితం, ప్రజాసేవ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ద్రౌపది ముర్ము మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ.. ఆమె సాగించిన అద్భుత ప్రయాణం, ప్రజాసేవకులు, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ నిజమైన స్ఫూర్తిదాయకం. ఇది అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్య బలానికి, అంకితభావంతో కూడిన ప్రజాసేవ శక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. దేశ సేవలో ఆమెకు మంచి ఆరోగ్యం, దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథ స్వామిని ప్రార్థిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

## తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్

పూర్తిగా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ రాష్టాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ సార్ వ్యతిరేకించారని తెలిపారు. ఏపీలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు.

## ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు మరియు పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మంత్రి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున వాటిని నివారించాలన్నారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారులు , జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, బండి అపర్ణ గారు, కంచర్ల వందన గౌడ్ గారు, ప్రేమలత అగర్వాల్, గోగుల సరిత బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం-కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణే అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళు తున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం

మండలం లింగంగుంట్లలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధుల విడుదలకు సంబంధించి రైతులు తమ ఫోన్ ద్వారా వచ్చాయో లేదో చూసి చెప్పాలన్నారు. అక్కడే రైతులు సెలఅ÷-÷-ఫోన్లు ఊపుతూ వచ్చాయని సైగలు చేశారు. టెక్నాలజీ పెరగడంతో క్షణాల్లో వ్యవహారం తెలిసిపోతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందుకు తాము నమ్మకంగా పనిచేస్తున్నామని అన్నారు. వైకాపా హయాంలో అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టడం తప్ప గొడ్డలి పార్టీకి మరేమీ తెలియదని విమర్శించారు. ఇవాళ యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ.. ఇలా మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నా జీవితంలో ఇవాళ్టికి మించిన ఆనందం మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసంవైపు తీసుకెళ్తామని మేం హామీ ఇచ్చాం. సంపద సృష్టించి.. రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పాం. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం. బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతులకు నిధులు జమయ్యాయి. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావు. మా ప్రభుత్వం 48 గంటల్లోనే డబ్బులు ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి.. తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. మనం ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే.. ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం అని చంద్రబాబు అన్నారు. 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున రూ.3,125 కోట్లు జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం- కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి ముఖ్యమంత్రి వర్చువల్‌గా వీక్షించారు. లింగంగుంట్లలో ప్రజావేదిక సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు, వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పుర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

## ఫిక్స్‌డు డోసం కాంబో ఔషధాలతో ముప్పు

**- 16 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై కేంద్రం నిషేధం**

న్యూఢిల్లీ,జూన్20 :వైద్యపరంగా సరైన ఆధారాలు లేవని, చికిత్సలో ప్రత్యేక ప్రయోజనం లేదని నిపుణుల కమిటీ నిర్ధారించిన 16 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల తయారీ, అమ్మకం, పంపిణీపై కేంద్రం నిషేధం విధించింది. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం కింద, ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ఈ మందుల తయారీ, అమ్మకం, పంపిణీని తక్షణమే నిషేధించింది.

రెండు లేదా అంతకంటే ఎక్కువ ఔషధ పదార్థాలను ఒకే మాత్ర లేదా సిరప్ రూపంలో కలిపి తయారు చేయడాన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ అంటారు. అయితే కొన్ని కాంబినేషన్లు రోగులకు అదనపు ప్రయోజనం కలిగించకపోగా, ఆరోగ్య సమస్యలు సృష్టించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. కమిటీ సిఫార్సుల ఆధారంగా, 16 కాంబినేషన్లు అహేతుకమైనవని, వాటిని కొనసాగించడం ప్రయోజనకరం కాదని ప్రభుత్వం నిర్ధారించింది. నిషేధిత జాబితాలో యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ, కడుపు తిమ్మిర్లకు ఉపయోగించే మందులు, కలబంద ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి. అమోక్సిసిలిన్, సెరాటియోపెప్టిడేస్, లాక్టోబాసిల్లస్ స్పోరోజెనెస్, సెఫ్యూరాక్సిమ్, సెఫాడ్రాక్సిల్ , ప్రోబెనెసిడ్, డైసైక్లోమైన్ పారాసెటమాల్ క్లిడినియం బ్రోమైడ్ ?క్లోర్డియాజెపాక్సైడ్‌తో పాటు అనేక కలబంద ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి. సురక్షితమైన, ప్రభావవంతమైన, శాస్త్రీయంగా ధ్రువీకరించిన మందులు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడటమే తమ లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

## మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్-2, ఎల్ అండి టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

## హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

## బస్సులో బంగారు ఆభరణాల చోరీ

నంద్యాల,జూన్20 : ల్లా డోన్ జాతీయ రహదారిలో ఉన్న ఓ దాబా వద్ద ప్రైవేటు బస్సులో చోరీ జరిగింది. హైదరాబాద్ వైపు వెళుతున్న ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తుండగా తన వద్ద నుంచి సుమారు 2.750 కిలోల బంగారం మాయమైందని బాధితుడు మోతీలాల్ తెలిపారు. బస్సు జడ్చర్ల దాటిన తర్వాత బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితుడు.. శనివారం మధ్యాహ్నం డోన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దాబా వద్ద బస్సు ఆగినప్పుడు చోరీ జరిగిందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ ఈ దాబా వద్ద రెండు సార్లు వెండి చోరీ ఘటనలు జరగడం గమనార్హం.

## నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం

***20 ఏళ్ల తరవాత పద్మసింహ పాటిల్ తదితరులు నిర్దోషులగా ప్రకటన***

ముంబై,జూన్20 :రెండు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉన్న పావన్‌రాజే నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ కేసులో మహారాష్ట్ర మాజీ హోంమంత్రి, పద్మసింహ్ పాటిల్‌తో పాటు మొత్తం తొమ్మిది మందిని నిర్దోషులుగా ప్రకటించింది. దాదాపు 20 సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో 128 మంది సాక్షులను విచారించిన అనంతరం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. 2006 జూన్ 3న కాంగ్రెస్ నేత పావన్‌రాజే నింబాల్కర్ తన డ్రైవర్ సమద్ అబ్దుల్ వాహిద్ కాజీతో కలిసి ప్రయాణిస్తుండగా నవీ ముంబైలోని కలంబోలి ప్రాంతంలో దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నింబాల్కర్, ఆయన డ్రైవర్ మరణించారు. ఈ హత్యలకు రాజకీయ శత్రుత్వమే కారణమని దర్యాప్తు సంస్థలు అప్పట్లో వెల్లడించాయి. నింబాల్కర్‌ను రాజకీయంగా తొలగించేందుకు పద్మసింహ్ పాటిల్ కుట్ర పన్నారని, దానికి పలువురు సహకరించారని సీబీఐ పేర్కొంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఈ కేసులో తీర్పు వచ్చింది.. నిందితులపై అభియోగాలు నిరూపించేందుకు తగిన ఆధారాలు లేవని ప్రత్యేక సీబీఐ కోర్టు పేర్కొంది. దీంతో పద్మసింహ్ పాటిల్ సహా మిగతా నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. కోర్టు తీర్పుపై సీబీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ తీర్పును బాంబే హైకోర్టులో సవాలు చేయనున్నట్లు సమాచారం.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా... !

మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్చేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్థగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున – స్థిరసుఖ మాసనమ్– అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో – సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్ఛ – ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము – ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ – ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.–ధవుతి, నేతి, వస్తి, నౌలి, త్రటకం, తధా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి – అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ దానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

## 'ఆచార్య సుధాకర', 'అవధాన సుధాకర' పురస్కార ప్రధానం






హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర (అక్కెళ్ళ విశ్వనాథ్) : ప్రఖ్యాత తిరుపతి వేంకటకవుల సాహిత్య పీఠం కాకినాడ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రాచార్య శలాక రఘునాథ శర్మ కి 'ఆచార్య సుధాకర' బిరుదు, గురువు సహస్రావధాని డాక్టర్. కడిమిళ్ళ వరప్రసాద్ కి 'అవధాన సుధాకర' బిరుదు పురస్కార ప్రధానోత్సవం కార్యక్రమంలో వైభవంగా జరిగింది. బుధవారం, తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్ వేదికపై తిరుపతి వేంకట కవుల సాహిత్య పీఠం సంయుక్త కార్యదరి డాక్టర్. కొమ్మూరి ప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్. కె.వి. రమణ, సభాధ్యక్షులు:గా పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం టి. గౌరీశంకర్, సభాప్రారంభకులుగా ఆచార్యులు తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్. సాగి కమలాకర శర్మ, ప్రత్యేక అతిథులుగా విశ్రాంత ఆచార్యులు, కార్యదర్శి, తిరుపతి వేంకట కవుల సాహిత్య పీఠం డాక్టర్. పోతుకూచి ఉమాభట్టీశ్వర శర్మ హాజరై పురస్కార గ్రహీతలు శలాక రఘునాథ శర్మ కు, డాక్టర్. కడిమిళ్ళ వరప్రసాద్ కు పురస్కారాలు అందజేసి ప్రశంశించి వారిని ఘనంగా సత్కరించారు. సభా కార్యక్రమానికి ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో లాస్యప్రియ హైదరాబాద్ విద్యార్థులచే కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.

# మహబూబ్‌నగర్ జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- 21,585 మంది రైతుల ఖాతాల్లో రూ.265 కోట్లు జమ
- మిగిలిన రూ.12 కోట్లు మూడు రోజుల్లో విడుదల
- సవాళ్లను అధిగమించి విజయవంతంగా ప్రక్రియ పూర్తి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి , జూన్ 20(విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ జిల్లాలో రబీ 2025–26 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 180 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర (మీరా) కల్పించామని పేర్కొన్నారు. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 22,414 మంది రైతుల నుండి 1,16,345.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్ వివరించారు. ఇందులో 41,996 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 74,349.800 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం ఉన్నట్లు పేర్కొన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు వేగవంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 21,585 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.265 కోట్లు జమ చేశామని, మిగిలిన రైతులకు చెందాల్సిన సుమారు రూ.12 కోట్ల నిధులను రానున్న మూడు రోజుల్లో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేసి కొనుగోళ్లను విజయవంతం చేసిందని ఆమె అన్నారు. ఈ సీజన్‌లో ధాన్యం సేకరణ సజావుగా సాగడానికి జిల్లా యంత్రాంగం అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొందని కలెక్టర్ వివరించారు. కొనుగోలు ప్రక్రియ మధ్యలో అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా, అధికారులు తక్షణమే స్పందించి తడిసిన ధాన్యాన్ని సమీప బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించారన్నారు. అదనపు టార్పాలిన్లను పంపిణీ చేసి పంటను రక్షించామని, వెదర్ యాప్‌ల ద్వారా వర్షాల అవకాశాలను ముందుగానే గుర్తించి కొనుగోలు కేంద్రాలకు తగిన సూచనలు జారీ చేశామని తెలిపారు. రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ (దిగుమతి) ఆలస్యం కాకుండా నిరంతర పర్యవేక్షణ కోసం జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రత్యేక అధికారులను ను నియమించామన్నారు. లారీల కొరత ఏర్పడినప్పుడు ఆర్టీఓ శాఖ సహకారంతో చెక్‌పోస్టుల ద్వారా అదనపు లారీలను సమకూర్చి రవాణాను వేగవంతం చేశామని, రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండే పరిస్థితి లేకుండా చూశామని కలెక్టర్ వివరించారు. ధాన్యం నాణ్యత, తేమ శాతం, తాలు వంటి అంశాలపై రైతులకు క్షేత్రస్థాయిలోనే అవగాహన కల్పించి సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రజాప్రతినిధులు, రైతులు, ఐకేపీ మహిళా సంఘాలు, మెప్మా సిబ్బంది, పీఏసీఎస్ నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లతో పాటు పౌర సరఫరాలు, రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, పోలీస్, రవాణా శాఖల అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.




నిర్మల్ జిల్లా,జూన్ 20,(విజన్ ఆంధ్ర); కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విజయ డైరీ పురోగతిపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ డైరీ ద్వారా పాడి రైతులకు అందుతున్న సేవలు, పాల సేకరణ సామర్థ్యం పెంపు, మార్కెటింగ్ లో చేపట్టాల్సిన మార్పులపై చర్చించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పాడి పరిశ్రమను లాభాల బాటలో నడిపించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. పాల సేకరణ కేంద్రాల విస్తరణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయ డైరీ ఉత్పత్తులు ఎల్లప్పుడూ నాణ్యతను పాటిస్తూ, మార్కెట్లో వాటి లభ్యతను విస్తృతం చేయడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనాలని సూచించారు. పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాల ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. విజయ డైరీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమ అభివృద్ధి వల్ల పాడి రైతులు ఆర్థికంగా లాభం పొందడమే కాకుండా, ప్రజలకు మెరుగైన పాలు, పాల ఉత్పత్తులు అందుతాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ కు విజయ డైరీ ఉత్పత్తులు సంస్థ అధికారులు అందించారు. ఈ సమావేశంలో విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, డిఆర్డీఓ విజయలక్ష్మి, పశుసంవర్ధక అధికారి బాలిగ్ అహ్మద్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఎల్డీఎం రాంగోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేడు నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

***ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం***

***మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత గేట్లు మూసివేత: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా***



మహబూబ్ నగర్, జూన్ 20 (విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లాలో జూన్ 21న (ఆదివారం) జరగనున్న నీట్ (చీజుజు–2026) పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డి.జానకితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాలలో మొత్తం 4,291 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు విద్యా, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ముఖ్యమైన నిబంధనలు & సమయాలు:

పరీక్ష సమయం: మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు.

ప్రవేశ సమయం: ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు.

గేట్ల మూసివేత: మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను లోపలికి అనుమతించరు.

విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం: పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ ఆర్టీసీ (RTC) రవాణా శాఖ తరపున ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా తగినన్ని బస్సులు నడపాలని రవాణా అధికారులను ఆదేశించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అభ్యర్థులు ఒక రోజు ముందుగానే పరీక్షా కేంద్రాన్ని సందర్శించి లొకేషన్ తెలుసుకోవాలని సూచించారు.

అభ్యర్థులు తప్పనిసరిగా తేవాల్సినవి: NTA వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డ్ / హాల్ టికెట్ (నిర్ణీత స్థలంలో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అతికించి ఉండాలి).

చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో ఐడీ ప్రూఫ్.

PwBD కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అదనంగా 1 గంట సమయం (Compensatory Time) కల్పించబడుతుంది.

నిషేధిత వస్తువులు – నిషూ: సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, పుస్తకాలు, నోట్స్ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవు.

అభ్యర్థులు సాధారణ దుస్తుల్లో రావాలి. మహిళా అభ్యర్థులతో సహా ఎవరూ ఆభరణాలు, మెటల్ వస్తువులు ధరించకూడదు. కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీలు (Frisking), బయోమెట్రిక్ హాజరు, ఫేస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఉంటాయి.

పరీక్షా సమయాల్లో కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేఫ్‌లు, బుక్ స్టాళ్లను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డీఆర్ఓ ఏ. నిర్మల, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, నోడల్ అధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గంలో కేసుల పరిష్కారం ఉత్తమం

### - అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవికుమార్



గద్వాల జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఏళ్లుగా పరిష్కారం కానీ వివిధ రకాల కేసుల్లో ఇబ్బందులు పడుతున్న కక్షిదారులకు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడమే ఉత్తమ మార్గమని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి రవికుమార్ పేర్కొన్నారు. గద్వాల కోర్టు ఆవరణలో శనివారం హైకోర్టు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగా పనిచేస్తోందన్నారు. కక్షిదారులు సమయం, ధనం, శ్రమను ఆదా చేసుకోవడంతో పాటు దీర్ఘకాలిక న్యాయ వివాదాలకు ముగింపు పలికి ప్రశాంతమైన జీవితం గడపడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాత కేసులు పరిష్కారం కావడం ద్వారా న్యాయ వ్యవస్థపై ప్రజల కు విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల విచారణ కొనసాగుతున్న కేసులు కూడా లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం పొందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా మోటార్ ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రుణాల వసూళ్ల కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, తదితర సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 7046 కేసులను పరిష్కరించినట్లు వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రజలు రాజీ కాగల కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్గా, అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, న్యాయవాదుల బృందం, సీఐలు, ఎస్సైలు, పోలీసు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీం భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్,జూన్20 : రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్గ÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయులు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

# అంతర్జాతీయ వైద్య వేదికపై మెరిసిన తెలంగాణ వైద్యుడు

**కాలేయ వ్యాధుల చికిత్సలో కొత్త దిశలను ఆవిష్కరించిన డా. ఉదయ్ కుమార్ మర్రి**



విజన్ ఆంధ్ర(20)హైదరాబాద్ : కాలేయ వ్యాధుల చికిత్సలో నూతన అవకాశాలకు దారి చూపే పరిశోధనతో తెలంగాణకు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు డా. ఉదయ్ కుమార్ మర్రి అంతర్జాతీయ గుర్తింపు పొందారు, చైనాలోని సుజౌ నగరంలో నిర్వహించిన ఆసియా పసిఫిక్ హృదయనాళ మరియు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వార్షిక సదస్సులో ఆయన సమర్పించిన పరిశోధన వైద్య నిపుణుల ప్రశంసలు అందుకుంది, కాలేయ వ్యాధుల వల్ల ఏర్పడే హెపాటిక్ ఎన్‌సెఫలోపతి సమస్యపై చేసిన అధ్యయనంలో, రోగుల చికిత్సను మరింత సమర్థ వంతంగా మార్చగల ఆధునిక ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విధానాలను ఆయన వివరించారు, ఈ పరిశోధన భవిష్యత్‌లో కాలేయ వ్యాధుల చికిత్సకు ఉపయోగ పడే విలువైన సమాచారాన్ని అందిస్తుందని నిపుణులు అభిప్రాయ పడ్డారు, ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థలో ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగానికి నాయకత్వం వహిస్తున్న డా.ఉదయ్ కుమార్, భారతదేశం తరపున ఈ సదస్సులో పాల్గొని తన పరిశోధన ఫలితాలను ప్రపంచ వేదికపై ఆవిష్కరించడం గర్వ కారణమని తెలిపారు, సదస్సులో పాల్గొన్న అంతర్జాతీయ వైద్య నిపుణులు ఆయన కృషిని అభినందించారు, తెలంగాణకు చెందిన వైద్యుడు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందడం రాష్ట్రానికి గర్వ కారణమని వైద్య వర్గాలు పేర్కొన్నాయి, డా.ఉదయ్ కుమార్ సాధించిన ఈ విజయం యువ వైద్యులకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు

# కనువిందు చేసిన 'లక్ష్మి సాయి అక్షరా' కూచిపూడి రంగప్రవేశం



హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రఖ్యాత కూచిపూడి శిక్షణా సంస్థ "శ్రీ శారద నృత్యనికేతన్" హైదరాబాద్ సమర్పణలో నిర్వహించిన 'కుమారి లక్ష్మీ సాయి అక్షరా విందూరు' కూచిపూడి రంగప్రవేశం ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది, కనువిందు చేసింది. శుక్రవారంనాడు ప్రతిష్ఠాత్మకమైన రవీంద్రభారతి, ఆడిటోరియం, సైఫాబాద్, హైదరాబాద్ లో " శ్రీ శారద నృత్య నికేతన్ " వ్యవస్థాపకురాలు , ప్రముఖ నాట్య గురువు శైలజ ప్రసాద్ మునుపూరు, శిష్యురాలైన కుమారి లక్ష్మీ సాయి అక్షరా విందూరు ఎంతో శ్రద్ధతో గురువు శైలజ ప్రసాద్ నట్టు వాంగానికి, మంతా శ్రీనివాస్ గాత్రానికి, పక్క వాయిద్యాలకి అనుగుణంగా శృతి పక్వంగా లయ బద్ధంగా చక్కని ముఖ



కవళికలతో, హావభావాలతో, అభినయంతో నేత్రపర్వంగా కూచిపూడి నృత్యాంశాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది. కన్నుల పండుగగా సాగిన ఈ 'కుమారి లక్ష్మీ సాయి అక్షర విందూరు' కూచిపూడి రంగప్రవేశం కార్యక్రమానికి అతిథులుగా ప్రఖ్యాత కూచిపూడి నాట్య కళాకారుడు గురువు వేదాంతం రాధేశాం, విశ్రాంత డిస్టిక్ జడ్జి నేరెళ్ల మాలయాద్రి, సప్లై చెయిన్ ప్రొఫెషనల్ సత్య ప్రసాద్ సేల్వుందుం పాల్గొని లక్ష్మీ సాయి అక్షరా ను చక్కటి కళాకారిణిగా తీర్చిదిద్దిన గురువు శైలజ ప్రసాద్ ను అభినందించారు. ఎంతో పరిణతి చెందిన కళాకారిణిగా లక్ష్మీ సాయి అక్షరా, చక్కటి నృత్యంశాలని నేత్రపర్వంగా ప్రదర్శించిందని కొనియాడారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు హాజరై చక్కని అభినయంతో అందరినీ అలరించి, ఆకట్టుకుని, మెప్పించిన లక్ష్మీ సాయి అక్షరా ను ప్రశంశించి శుభాకాంక్షలు తెలిపారు. కుమారి సాయి అక్షరా కి నృత్యం పట్ల ఆశక్తిని, ఆమెలోని ప్రతిభను గుర్తించి అన్ని విధాలుగా ప్రోత్సహించిన తల్లిదండ్రులు నిరంజన్ కుమార్, ప్రత్యుష లను మెచ్చుకొని, శుభాభినందనలు తెలియజేశారు. కార్యక్రమానికి చక్కటి వ్యాఖ్యానాన్ని పవన్ కుమార్ అందించారు.

# భోజనంలో నాణ్యతే ప్రధానం.

**- పాఠశాలల్లో సివిల్ సప్లైస్ రైడ్**



ములుగు జూన్ 21, విజన్ ఆంధ్ర ప్రతినిధి : శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని పాఠశాలలు, వసతి గృహాల్లో ఏఎం టెక్నికల్ సివిల్ సప్లైస్ షేక్ ఇర్ఫాన్, ఎస్ఐ రిటైర్డ్ పి. జంగయ్య, టెక్నికల్ అసిస్టెంట్ ఎ. రాహుల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బండారుపల్లి గ్రామంలోని టీజీఎంఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవకి, టీజీఆర్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. విజయేందర్ సమక్షంలో పాఠశాలలను సందర్శించిన అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆహార నాణ్యత, రుచి, వంట విధానంపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ ప్రజలకు, విద్యార్థులకు నాణ్యమైన బియ్యం అందించడంలో ముందుంటుందని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులు సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పచ్చదనం పెంపొందించడమే 'వన మహోత్సవం' లక్ష్యం

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**





వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 20 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం ప్రారంభించిన "వన మహోత్సవం" కార్యక్రమ లక్ష్యాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ సూచించారు. శనివారం కొత్తకోట మండలం ఖానాయపల్లి, అమడబాకుల గ్రామపంచాయతీలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలలు మరియు నర్సరీలను సందర్శించిన అదనపు కలెక్టర్, పాఠశాలల్లో రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యాభ్యాసం, పాఠశాల పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. పాఠశాలల నిర్వహణ తీరును సమీక్షించి విద్యార్థుల హాజరు శాతాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదనంగా నర్సరీలో పెంచుతున్న మొక్కల సంరక్షణ, నిర్వహణపై వివరాలు తెలుసుకుని, మొక్కలను నాణ్యతతో పెంచాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ఉమాదేవి, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వనపర్తి, ఆత్మకూరు కోర్టుల్లో ఘనంగా లోక్ అదాలత్

**- ఏకంగా 5,264 కేసులు పరిష్కారం**

**- వెల్లడించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. కళార్చన**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 20 (విజన్ ఆంధ్ర) : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలో మరియు ఆత్మకూరు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ జి.కళార్చన మాట్లాడుతూ జిల్లాలో వివిధ కోర్టులలో సివిల్ కేసులు 11, క్రిమినల్ కేసులు 1527, ప్రీ లిటిగేషన్ కేసులు 3726 మొత్తం 5264 కేసులు పరిష్కారమయ్యాయని తెలియజేశారు. కార్యక్రమం లో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కే. కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ టి. కార్తీక్ రెడ్డి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి శ్రీలత, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎన్. అశ్విని, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, డి.ఎస్.పి గిరిధర్ రావు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది మరియు లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకై పెట్రోలింగ్ చేపట్టాలి

***- డీసీపీ ఎగ్గడి భాస్కర్***



మందమర్రి, జూన్ 20 (విజన్ ఆంధ్ర) : నేరాల నియంత్రణకు నిరంతరం పెట్రోలియం చేపట్టాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం మందమర్రి పోలీస్ స్టేషన్ సందర్శించిన ఆయన స్టేషన్ పరిసరాలను,సీసీ కెమెరాల పని తీరును బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. అలాగే రిసెప్షన్ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. నమోదవుతున్న కేసులు,రౌడీ షీటర్ల వివరాలు,నేరాల స్వభావం,కేసుల పురోగతిపై సీఐ పర్శ రమేష్,ఎస్సై నరేష్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# రైతుల పట్ల నిర్లక్ష్యం సహించం

**- ప్రతి గింజ కొనే వరకు పోరాటం ఆపం.**

**- బీఆర్ఎస్ మాజీ జెడ్పీ చైర్మన్ నాగజ్యోతి ప్రభుత్వానికి హెచ్చరిక**



ములుగు జూన్ 21, విజన్ ఆంధ్ర ప్రతినిధి : శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగజ్యోతి మాట్లాడుతూ ....రైతుల 6పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని హెచ్చరించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'ఒక్క గింజ కూడా ఎక్కువ కొనం అంటూ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారు' అని మండిపడ్డారు. 2013లో 40 లక్షల ఎకరాల్లో సాగు 2014 తర్వాత 2.30 కోట్ల ఎకరాలకు పెరిగిందని, 'ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా నిలిచిన తెలంగాణ రైతులు నేడు కరెంట్, ఎరువులు, నీటి కొరతతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగులో వరి, మొక్కజొన్న, మిర్చి రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు కింద రూ.72 వేల కోట్లు, రుణమాఫీకి రూ.29 వేల కోట్లు ఇచ్చామని గుర్తుచేశారు. ప్రతి పంటకు మద్దతు ధర ఇచ్చి, పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు.

# అంతర్జాతీయ స్థాయిలో వనపర్తి ఎమ్మెల్యే కుమారుడి ప్రతిభ..

## *ఈఎస్ సిపి బిజినెస్ స్కూల్‌లో డ్యుయల్ మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన తూడి నవనీత్ రెడ్డి!*



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 20 (విజన్ ఆంధ్ర) యూరప్ లోని అత్యంత ప్రతిష్టాత్మక ఉన్నత విద్యా సంస్థ అయిన 'ఈఎస్ సిపి బిజినెస్ స్కూల్'లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తనయుడు తూడి నవనీత్ రెడ్డి ఏకకాలంలో ద్యూయల్ మాస్టర్ డిగ్రిని విజయవంతంగా పూర్తి చేసి అంతర్జాతీయ స్థాయిలో తన విద్యా ప్రతిభను చాటుకున్నారు.

**రెండు దేశాల్లో.. రెండు ప్రతిష్టాత్మక డిగ్రీలు**

ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ బిజినెస్ స్కూళ్లలో ఒకటిగా గుర్తింపు పొందిన ఈఎస్ సిపి బిజినెస్ స్కూల్ (స్థాపన 1819) లో విద్యాభ్యాసం చేసిన నవనీత్ రెడ్డి, రెండు దేశాల విద్యా ప్రమాణాలను సమర్థవంతంగా అధిగమించారు. ఆయన ఫ్రాన్స్ లో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) పట్టాను, అలాగే జర్మనీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్ సి ) పట్టాను **ఏకకాలంలో పూర్తి చేయడం విశేషం.**

ఘనంగా స్నాతకోత్సవం.. హాజరైన కుటుంబ సభ్యులు

ఈ నెల 19న ఫ్రాన్స్ లో అత్యంత వైభవంగా జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో నవనీత్ రెడ్డి తమ డిగ్రీలను అందుకున్నారు. ఈ వేడుకలో ఆయన తల్లిదండ్రులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి – శారద దంపతులు, మరియు సోదరుడు మనోజ్ రెడ్డి స్వయంగా పాల్గొని నవనీత్ రెడ్డిని అభినందించారు.

**యువతకు ఆదర్శం..**

ప్రపంచ స్థాయి విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆకాంక్ష, పట్టుదల కలిగిన నేటి తరం విద్యార్థులకు నవనీత్ రెడ్డి ఒక రోల్ మోడల్‌గా నిలుస్తున్నారు. ఇంతటి అంతర్జాతీయ ఘనత సాధించిన నవనీత్ రెడ్డికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, నియోజకవర్గ నాయకులు మరియు శ్రేయోభిలాషులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.


**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము**

కలెక్టర్ వారి కార్యాలయం, సిద్దిపేట, రెవెన్యూ (భూసేకరణ) శాఖ

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూలు 25 (1) ను అనుసరించి)

(డిక్లరేషన్ / రూడి ప్రకటన)

ఫారం - VII

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నం. G3/837/2018 తేది:16 .06.2026

రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ ఫైల్ నం. D/68/2026 తేది:15 .06.2026

గెజిట్ నెంబరు. 54/2020 : తేది:16 .06.2026

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరిచిన సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలములలోని బెక్కల్ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం ఎకరములు 3.19 గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా JCR-DLIS, Phase-III, Package - VIll కాలువల నిర్మాణ నిమిత్తము ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున సేకరించుటకు నిర్ణయించినారు.

కావున సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలములలోని బెక్కల్ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం ఎకరములు 3.19 గుంటలు గల భూమి ప్రయోజన నిమిత్తం అనగా JCR-DLIS, Phase-III, Package - Vill కాలువల నిర్మాణ నిమిత్తము భూసేకరణ ప్రామాణిక కొలతలు గల భూమికై దిగువ వివరించిన విధముగా రూడి ప్రకట (డిక్లరేషన్) చేయబడుచున్నాము.

షెడ్యూల్

| క్రమ సంఖ్య | సర్వే నెం | భూమి రకం (మెట్ట, మాగాణి మొదలైనవి) | సేకరణ పరిధిలోని విస్తీర్ణం (ఎకరాలలో) | పట్టాదారు / అనుభవదారుల పేర్లు (తండ్రి లేదా భర్త పేరుతో సహా) | నిర్మాణాలు, చెట్లు మొదలైనవాటి వివరాలు |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| గ్రామము : బెక్కల్ | | | | మండలము : దూల్మిట్ట | జిల్లా: సిద్దిపేట |
| for excavation of Minor 3L of D-5R RMC Canal of JCR-DLIS, Phase-III, Package-VIII from KM 1.300 to 1.575 | | | | | |
| 1 | 198 | పొడి / పట్టా | 0.35 | మౌటం శ్రీనివాస్ రెడ్డి తండ్రి వెంకట్ రామయ్య (0.01) ఆకుల రమేష్ తండ్రి రాజయ్య (0.09) మౌటం బాలయ్య తండ్రి వెంకట్ రామయ్య (0.25) | - |
| 2 | 199 | పొడి / పట్టా | 1.19 | అర్జుల జ్యోతి భర్త సురేష్ (0.32) దారి (0.02) అర్జుల రాజి రెడ్డి తండ్రి సత్తి రెడ్డి అర్జుల నవీన్ కుమార్ తండ్రి సత్తి రెడ్డి అర్జుల మణెమ్మ భర్త సత్తి రెడ్డి (0.25) | - - |
| 3 | 205 | పొడి / పట్టా | 1.05 | దామంతుల యాదయ్య తండ్రి ఆగయ్య (0.12) దామంతుల రామస్వామి తండ్రి ఆగయ్య (0.15) దామంతుల కనుకయ్య తండ్రి ఆగయ్య (0.05) చొప్పరి బాబు తండ్రి గలయ్య (0.13) | |
| | విస్తీర్ణం | | 3.19 | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ సంబంధించి గతములో జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్ పై సెక్షన్ (15) క్రింద నిర్ణీత గడువులో ఎలాంటి అభ్యంతరాలను రానందున, ఇట్టి రూడి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయబడుచున్నది. ఈ భూసేకరణ JCR-DLIS, Phase-III, Package-VIll కాలువల నిర్మాణ నిమిత్తము మాత్రమే అయినందున గ్రామములో ఎవరు కూడా నిర్వాసితులు కానందున పునరావాస ప్రశ్న ఉత్పన్నము కాదు.

ప్రాజెక్ట్ కొరకు భూమి సేకరించబడుచున్నందున నిర్మాణ దశలో ఉన్న సదరు భూమి లేదా సదరు భూమి యొక్క ఏదేని భాగం, ఇతర భాగాలలో ఉండే గనులు, ఖనిజాలను త్రవ్వ సమయములో బొగ్గు, ఇనుము రాయి, నాపరాయి లేదా ఇతర ఖనిజాల గనుల నుండి వచ్చే ఖనిజాలు అవసరం లేదు.

ఇట్టి భూమి యొక్క ప్లానును భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ గారి కార్యాలయములో ఏదేని పని దినమున పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికార మరియు , రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ | సం/- అదనపు కటెక్టర్ (రెవిన్యూ), సిద్దిపేట | సం/- జిల్లా కలెక్టర్, సిద్దిపేట

DIPR RO NO 320-LA/PP/ADVT/PUB -2026-27 date 20-06-2026


# 2028 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్

## యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రగాని సందీప్ గౌడ్




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 20 (విజన్ ఆంధ్ర ) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రాబోయే రెండేళ్లలో (2028 నాటికి) భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రగాని సందీప్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ పాలనకు 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో యువమోర్చా జిల్లా అధ్యక్షులు ఎన్. అరవింద్ నేతృత్వంలో ' జన్ జెడ్ నమో కాన్క్లేవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందీప్ గౌడ్ దేశంలో జరిగిన విప్లవాత్మక మార్పులను వివరించారు.

**నగదు బదిలీ :**

జన్ధన్–ఆధార్–మొబైల్ (జీఏవీ) త్రయం ద్వారా దేశంలో 58 కోట్ల జన్ధన్ ఖాతాలు తెరిచారు. ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ. 51 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరాయి. 2014లో 56 పథకాలతో ప్రారంభమైన ఇదీ, నేడు 325 పథకాలకు విస్తరించింది.

**యూపీఐ లావాదేవీలు:**

ప్రపంచ రియల్ టైం పేమెంట్ లావాదేవీలలో భారతదేశ వాటా 49 శాతానికి చేరింది. 2026 మార్చిలోనే దాదాపు రూ. 30 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి.

**ఇంటర్నెట్ విప్లవం:**

2014లో 1 +దీ డేటా ధర రూ. 269 ఉండగా, నేడు అది రూ. 8–10 కి తగ్గింది. దేశంలోని 99.9% జిల్లాల్లో 5+ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

**ఉద్యోగాల సృష్టి:**

దేశంలో 2.2 లక్షల అంకుర సంస్థలు (స్టార్టప్‌లు) నమోదు కావడం ద్వారా 23 లక్షలకు పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయి.

**రోజ్ గార్ మేళా:**

'ప్రధానమంత్రి రోజ్ గార్ మేళా' ద్వారా 19 విడతల్లో దాదాపు 12 లక్షల మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశారు.

**నైపుణ్యాభివృద్ధి:**

'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన' ద్వారా 1.6 కోట్ల మంది అభ్యర్థులు 35కు పైగా రంగాలలో శిక్షణ పొందారు.

**మెడికల్ సీట్ల పెంపు:**

2014కు ముందు దేశంలో 842 వైద్య కళాశాలలు ఉండగా, నేడు ఆ సంఖ్య 2,100కి చేరింది. ఎంబీబీఎస్ సీట్లు 51 వేల నుండి 1.30 లక్షలకు, పీజీ సీట్లు 31 వేల నుండి 86 వేలకు పెరిగాయి.

**ఆసుపత్రుల విస్తరణ:**

దేశంలో ఎయిమ్స్ (AIIMS) ఆసుపత్రుల సంఖ్య 8 నుండి 23కు పెరిగింది. ఆరోగ్య బడ్జెట్ రూ. 35 వేల కోట్ల నుండి రూ. 1.10 లక్షల కోట్లకు చేరింది.

**పీఎం రాహత్ పథకం:**

రహదారి ప్రమాద బాధితులకు ఏడు రోజుల పాటు రూ. 1,50,000 విలువైన ఉచిత (నగదు రహిత) చికిత్స సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

పారిశ్రామిక, ఎగుమతుల వృద్ధి

**ఎలక్ట్రానిక్స్ రంగం:**

ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ. 0.38 లక్షల కోట్ల నుంచి ఎనిమిది రెట్లు పెరిగి రూ. 3.33 లక్షల కోట్లకు చేరాయి. ఉత్పత్తి రూ. 1.9 లక్షల కోట్ల నుండి రూ. 11.3 లక్షల కోట్లకు వృద్ధి చెందింది. ఈ రంగంలో 25 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి.

**స్టాండ్ అప్ ఇండియా:**

ఎస్సీ/ఎస్టీలకు రూ. 15 వేల కోట్ల రుణాలతో ప్రారంభమై, 2026 నాటికి మంజూరు చేసిన మొత్తం రుణాలు రూ. 61 వేల కోట్లకు చేరాయి.

**విదేశీ మారక నిల్వలు:**

దేశంలో ప్రస్తుతం రూ. 67 లక్షల కోట్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. ఇవి 11 నెలల దిగుమతులకు మరియు బాహ్య రుణాలకు సరిపోతాయని, ఇది దేశ ఆర్థిక స్థిరత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ కాన్క్లేవ్‌లో బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొమ్ము శ్రీనివాసులు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవి నాయక్, యువమోర్చా నాయకులు చింతకాయల శివ, వెంకటేష్ నాయక్, చంద్రశేఖర్, రాము, రాజు నాయక్, చాణక్య, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ సమన్వయంతో పూర్తి చేయాలి

**- ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు సహకరించాలి**

**- మిల్లింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి**

**- అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి**



ములుగు జూన్ 21 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి తన ఛాంబర్‌లో బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మిల్లింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం, మిల్లర్లు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం మెరుగ్గా ఉంటే ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేన్, డి యం కృష్ణ వేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలను అనాధలుగా మార్చింది కాంగ్రెస్ పార్టీ

## -ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డిబ్యూరో, జూన్ :20( విజన్ ఆంధ్ర)అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో అన్నదాతలను అనాధలుగా మార్చే దుర్మార్గానికి కాంగ్రెస్ పార్టీ దిగజారిందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. శనివారం నాడు క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రులు రైతుల నడ్డి విరిచే రకంగా, రైతులకు ద్రోహం చేసే విధంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించాచారు.కేంద్రం చెప్పిన కోట వరకు మాత్రమే పంటలు కొంటామని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఒక్క గింజ కూడా కొనబోమని చెప్పడం రైతులకు మరణశాసనం లాంటిదని తెలిపారు.వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి రైతు బతుకును ఇబ్బందుల్లోకి నెట్టారని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపించారు.పదేళ్లపాటు ధైర్యంగా బతికిన రైతులను మళ్లీ సమైక్య రాష్ట్రం నాటి కష్టాల్లోకి నెట్టేశారన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు కష్టాలు తెలిసిన నాయకుడిగా రైతు సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. రైతుబంధు ద్వారా 11 విడతల్లో రూ.72 వేల కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని పేర్కొన్నారు. రైతు కుటుంబాలకు రూ.5 లక్షల రైతు బీమా అమలు చేశామని చెప్పారు.రైతు



రుణమాఫీకి రూ.29 వేల కోట్లు, రైతు బీమాకు రూ.6,800 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రైతుల ఖాతాల్లో లక్ష కోట్లకు పైగా నేరుగా జమ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి దేశంలో చరిత్ర సృష్టించామని గుర్తు చేశారు. రైతు కేంద్రబిందువుగా సాగిన పాలన వల్ల తెలంగాణలో వ్యవసాయ విప్లవం వచ్చిందన్నారు. 2014కు ముందు కోటి 31 లక్షల ఎకరాల పంట విస్తీర్ణం ఉండగా, 2023 నాటికి 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. తెలంగాణ దేశానికే ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారిందని పేర్కొన్నారు. కరోనా సమయంలో 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు వద్దే చివరి గింజ వరకు కొనుగోలుచేశామని చెప్పారు.వరితో పాటు మొక్కజొన్న, జొన్న, శనగ, కందులు, పెసలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను కూడా కొనుగోలు చేశామని తెలిపారు. రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు.రాష్ట్ర ప్రజల పక్షాన, రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.మళ్లీ కేసీఆర్ రావాలి అనే భావన ప్రజల్లో ఉందన్నారు.రేవంత్ రెడ్డి తెలంగాణ సొమ్మును ఢిల్లీకి పంపడమే చేస్తున్నారని ఆరోపించారు.పది సంవత్సరాల పాటు భూములను కాపాడామని తెలిపారు.అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.రైతుల పక్షాన మంత్రులు, జిల్లా కలెక్టర్‌ను కలిసి పరిహారం ఇవ్వాలని కోరామని చెప్పారు. రైతులను భయపెట్టి భూములు తీసుకుంటున్నారని ఆరోపించారు.గతంలో తీసుకొచ్చిన అభివృద్ధి నిధులను కూడా రద్దు చేశారని అన్నారు. కొత్తగా నిధులు తీసుకురాకుండా ప్రచారమే చేస్తున్నారని విమర్శించారు. అక్రమ నిర్మాణాలు, పేదల భూముల ఆక్రమణలను సహించబోమన్నారు.ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, నాయకులు శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ నాయక్, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగ గురువు యువి నాగలక్ష్మికి 'యోగ రత్న అవార్డు-26'



హైదరాబాద్, జూన్ 20 (విజన్ ఆంధ్ర): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రముఖ యోగా గురువు, జాయ్ ఆఫ్ యోగ డైరెక్టర్ యువి నాగలక్ష్మికి యోగ రత్న అవార్డు-2026 ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ ఏడాది ఈ అవార్డుకు ఎంపికైన ఏకైక వ్యక్తిగా ఆమె నిలిచారు. జూన్ 21న మౌలాలిలోని ఆర్పీఎస్ఎఫ్ 7వ బెటాలియన్లో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, టీసీసీ సికింద్రాబాద్ అధ్యక్షుడు రహదారి రామ్మోహన్ తెలిపారు. గత 25 ఏళ్లుగా యోగా సేవలు అందిస్తున్న యువి నాగలక్ష్మి, దేశ విదేశాల్లో యోగా ప్రచారంతో పాటు మహిళా హక్కులు, జాతీయ సమైక్యత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నారు.

## నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలు పేద బడుగు బలహీన వర్గాలకు చేరాయి

### -ఎమ్మెల్సీ సి.అంజి రెడ్డి





సంగారెడ్డి బ్యూరో, జూన్ :20(విజన్ ఆంధ్ర)దేశ ప్రజలకు నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను పేద బడుగు బలహీన వర్గాలకు ప్రతి ఒక్కరికి చేరే విధంగా విధంగా ఈ 12 సంవత్సరాలు జరిగిన పాలన జరిగిందనిఎమ్మెల్సీ సి.అంజి రెడ్డి అన్నారు12 సంవత్సరాల ప్రధాని నరేంద్ర మోడీ సుపరి పాలన గుడ్ గవర్నెన్స్ పూర్తి చేసుకున్న సందర్భంగా "నమో జెన్ జెడ్ కాంక్లేవ్ "అనే కార్యక్రమాన్ని బీజేవైఎం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బుర్ర ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని ఎంబి బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు . ఈ సందర్భంగాఎమ్మెల్సీ సి.అంజి రెడ్డి మాట్లాడుతూ దేశంలోని యువత స్కిల్ డెవలప్మెంట్ మేక్ ఇన్ ఇండియా లాంటి కార్యక్రమాల ద్వారా దేశం చాలా అభివృద్ధి చెందిందని దేశ అభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలని ఆయన కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను స్క్రీన్ ద్వారా వీక్షించడం జరిగింది ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు గోదావరి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్పాండే బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి నరేన్ దేశ్పాండే జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు పట్టణ అధ్యక్షులు దోమల విజయ్ కుమార్ కసిని వాసు హర్షవర్ధన్ రెడ్డి గిరిధర్ శ్రీకాంత్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి సాయిబాబా నాగరాజు ప్రవీణ్ మరియు బీజేవైఎం నాయకులు ప్రసాద్ సాయి రెడ్డి సాయి సందీప్ అభినవ్ సుజన్ బిజెపి సీనియర్ నాయకులు నర్సారెడ్డి హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నకిలీ ట్రక్ చిట్టీలతో రూ.91 లక్షల ప్రభుత్వ ధాన్యం నిధుల దుర్వినియోగం

### ఆరుగురు నిందితుల అరెస్ట్.. రూ.14.16 లక్షల నగదు స్వాధీనం.. రూ.46.21 లక్షలు బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్

రాజన్న సిరిసిల్ల, జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో):ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ ట్రక్ చిట్టీలు సృష్టించి సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను అక్రమంగా మళ్లించిన కేసులో ఆరుగురు నిందితులను సిరిసిల్ల టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.14.16 లక్షల నగదు స్వాధీనం చేసుకోగా, రూ.46.21 లక్షలను బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం మేనేజర్ ఉత్కం విజయ్, గోదాం సూపర్వైజర్ వాసాల గణేష్, రుద్రంగి ఐకేపీ ఇన్‌చార్జ్ గడ్డం స్వామి, డీఎంఓ కార్యాలయ మండల కోఆర్డినేటర్ కమ్మరి రాజశేఖర్, బద్దెనపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ గాజుల నవీన్ తదితరులు కుమ్మక్కై నకిలీ ట్రక్ చిట్టీలు రూపొందించి సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ప్రభుత్వ నిధులను పొందినట్లు తెలిపారు.అలాగే, వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి వచ్చిన 10 లారీల ధాన్యాన్ని గోదాంలో దించకుండానే ఆన్‌లైన్‌లో దించినట్లు నమోదు చేసి, ఆ ధాన్యాన్ని వేములవాడకు చెందిన చెపూరి మధుకర్‌కు అప్పగించారని, అతను సిద్ధిపేటకు చెందిన కమిషన్ ఏజెంట్ చిటుకుల శ్రీకాంత్ ద్వారా వివిధ రైస్ మిల్లులకు విక్రయించి వచ్చిన మొత్తాన్ని పరస్పరం పంచుకున్నట్లు



దర్యాప్తులో వెల్లడైంది.జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్. నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. విచారణలో రూ.91 లక్షల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలిందని ఎస్పీ తెలిపారు.అరెస్టు చేసిన నిందితుల్లో ఉత్కం విజయ్, కమ్మరి రాజశేఖర్, చెపూరి మధుకర్, వాసాల గణేష్, గాజుల నవీన్ ఉన్నారు. వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, సంబంధిత పత్రాలు, రూ.14,16,800 నగదు స్వాధీనం చేసుకోగా, రూ.46,21,358ను బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు చిటుకుల శ్రీకాంత్ పరారీలో ఉండగా, కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతోంది.రూ.91 లక్షల ప్రభుత్వ నిధుల దుర్వినియోగంఆరుగురు నిందితుల అరెస్ట్రూ.14.16 లక్షల నగదు స్వాధీనంరూ.46.21 లక్షల బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్నకిలీ ట్రక్ చిట్టీలు, ఆన్‌లైన్ ఎంట్రీలతో భారీ మోసంకేసులో మరింత దర్యాప్తు కొనసాగుతోంది

## యూనియన్ డే పురస్కరించుకొని ఎస్ బి ఐ మేగా రక్తదాన శిబిరం




మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 20,(విజన్ ఆంధ్రపట్టణంలోని రెడ్డి కాలనీ బ్రాంచ్ లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బి ఐ ) ఉద్యోగులు యూనియన్ డే సందర్భంగా కామ్రేడ్ వై.తారక్ నాథ్22 వ వర్ధంతిని పురస్కరించుకొని ఎస్ బి ఐ, ఎస్ యు హెచ్ సి ఆధ్వర్యంలో శనివారం మేఘ రక్తదాన శిభిరం నిర్వహించారు.కామ్రేడ్ కే. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఏడాది యూనియన్ డే పురస్కరించుకొని ఎస్ బి ఐ సిబ్బంది రక్తదానం చేయడం జరుగుతుందన్నారు. కామ్రేడ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో సుమారు 50 యూనిట్ల రక్తం అందించారు.వివిధ ఎస్ బి ఐ బ్రాంచ్ ల సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.ఈ రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా, చీఫ్ మేనేజర్ అలోక్ వర్మ, హెచ్ఆర్ రామకృష్ణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల్ జిల్లా జనరల్ సెక్రెటరీ చందూరి మహేందర్ స్టేట్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు వి.మధుసూదన్ రెడ్డి, ఎస్బిఐ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## 500 కోట్లతో చెరువు ను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దేలా ప్రణాళికలు

### - త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన

సంగారెడ్డి బ్యూరో, జూన్ :20(విజన్ ఆంధ్ర)సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ చెరువును రూ. 500 కోట్లతో అభివృద్ధి చేసే దిశగా జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వేగం పెంచారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని హంగులతో కింది బజార్ చెరువును అభివృద్ధి చేసేలా చేపట్టాల్సిన పనుల గురించి ఈ సందర్భంగా చర్చించారు. కిలోమీటరున్నర పొడవున ఉన్న చెరువు కట్టను అభివృద్ధి చేయడంతో పాటు, నెక్లెస్ రోడ్, పార్కులు ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు. సంగారెడ్డి పరిసర ప్రాంత ప్రజలతోపాటు, హైదరాబాద్ నుంచి వచ్చే వారికి ఆహ్లాదం పంచేలా కింది బజార్ చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జగ్గారెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కింది బజార్ చెరువు కట్ట పనులకు శంకుస్థాపన





చేసేలా పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన అన్ని ప్రతిపాదనలు పూర్తి చేయాలని జగ్గారెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రెండేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఈ ప్రాంతాన్ని అందుబాటులోకి తేవాలన్నారు .చెరువు వద్దకు వెళ్లి పరిశీలన! సమీక్ష నిర్వహించిన అనంతరం జగ్గారెడ్డి, నిర్మల సంబంధిత అధికారులతో కలిసి కింది బజార్ చెరువు కట్ట వద్దకు వెళ్లారు. అలుగు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏమేం పనులు చేయాలనే అంశమై ఈ సందర్భంగా జగ్గారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో



ముధోల్:20జూన్:విజన్ ఆంధ్ర.ముధోల్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన గురుకుల బాలికల పాఠశాలను శనివారం ముధోల్ ఎంపీడీవో లవ కుమార్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో వంటగది, డ్రింకింగ్ వాటర్, మరుగుదొడ్లు, విద్యార్థులకు అందజేస్తున్న ఆహార మెనూ పట్టికను పరిశీలించారు. ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న తీరును ప్రిన్సిపాల్ సూర్యదాస్ ను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాల దృశ్య పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పీ. శ్రీనివాసరావు,జే. వసంత్, మోతి రామ్ తో పాటు తదితరులున్నారు.

## ప్రియుడి మోజులో రెండేళ్ల కొడుకు హత్య

### ఫిట్స్‌తో చనిపోయాడని భర్తను నమ్మించిన భార్య అనుమానంతో పోలీసులకు ఫిర్యాదుతో బయటపడ్డ బండారం

సిద్దిపేట,జూన్20: సిద్దిపేట జిల్లాలో దారుణం జరిగింది. ప్రియుడితో ఏకాంతంగా గడిపేందుకు అడ్డొస్తున్నాడని రెండేళ్ల కొడుకునే ఓ కన్నతల్లి హత్యచేసింది. ఫిట్స్ వచ్చి చనిపోయాడని అందర్నీ నమ్మించింది. కానీ తండ్రికి అనుమానం రావడంతో 20 రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి క్యాబ్ డ్రైవర్. భార్య జ్యోతి, రెండేళ్ల కుమారుడు హరికృష్ణతో కలిసి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి నవీన్ అనే వ్యక్తితో అక్రర సంబంధం పెట్టుకుంది. భర్త లేని సమయంలో ప్రియుడిని ఇంటికి పిలుచుకునేది. ఇలా వాళ్లిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో బాబు తరచూ ఏడుస్తుండటంతో నవీన్ చిరాకు పడ్డాడు. ఈ క్రమంలోనే నీ కొడుకు నాకు నచ్చలేదు.. వాడిని చంపేద్దామని జ్యోతితో చెప్పాడు. అందుకు జ్యోతి కూడా ఓకే చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి ఏడుస్తున్న బాబును.. క్రూరంగా నేలకేసి కొట్టి చంపారు. బాబు చనిపోయిన తర్వాత నాటకమాడిన జ్యోతి.. భర్త స్వామి ఇంటికి రాగానే అకస్మా?త్తుగా ఫిట్స్ వచ్చి బాబు చనిపోయాడని ఏడ్చింది. భార్య మాటలు నమ్మిన స్వామి.. నిజమేనని భావించి.. అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామమైన తీగుల్ తీసుకెళ్లి ఖననం చేశాడు. కానీ కొద్దిరోజుల తర్వాత భార్య ప్రవర్తనలో తేడా రావడంతో స్వామికి అనుమానం మొదలైంది. పైగా ఇంట్లో రక్తపు మరకలు కనబడటంతో అది కాస్త బలపడింది. దీంతో తన కొడుకు మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా.. జ్యోతి నేరం అంగీకరించింది. ఈ ఘటనలో జ్యోతిని పోలీసులు అరెస్టు చేయగా.. నవీన్ పరారీలో ఉన్నాడు.

## చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్

హన్మకొండ,జూన్20: చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి.

## సర్ ప్రక్రియతలో అప్రమత్తం కావాలి

### ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్త పడాలి కార్యకర్తలకు మంత్రి తుమ్మల హితవు

ఖమ్మం,జూన్20: సర్‌పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సర్‌లో ఓట్ల తొలగింపు సమయంలో సక్రమంగా గుర్తించాలని అన్నారు. శనివారం ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని.. ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు. ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం లేదని వ్యాఖ్యానించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు శాతం ఓట్ల తేడాతోనే గెలవడం జరిగిందని మంత్రి తెలిపారు. సర్ కార్యక్రమంలో 55 శాతానికి పైగా ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్ ఓడిపోవడానికి కారణాలు, పరిస్థితిలు గుర్తు చేసుకోవాలని నాయకులకు సూచించారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారికి జీవన్మరణ సమస్య తప్పదన్నారు. బీజేపీ కావాలని ఓట్లను తొలగిస్తోందని, మరో పార్టీ మరోలా చేస్తోందని రకరకాల ప్రచారాలు వస్తున్నాయన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని తెలిపారు. అధికారులకు సహకరించాలని, వారితో కలిసి సమన్వయం చేసుకొని ఓట్లను కాపాడుకోవాలని నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.

## అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

### రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు

హైదరాబాద్,జూన్20: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు.సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదా అని పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తుచేశారు. కేంద్రం వడ్లు కొనుగోలు చేయకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మోదీకి సరెండర్ అయిపోయాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని, అసమర్థను ఆయన ప్రకటనలే బయటపెడుతున్నాయని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ, ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతిదాంట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగురడం, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలను రైతుల ఖాతాలో జమ చేయాలలన్నారు. లేదంటే అసెంబ్లీ వేదికగానే కాకుండా, రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

## వర్షాకాలానికి సర్వసన్నద్ధం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్



ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,జూన్ 20,(విజన్ ఆంధ్ర) రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు,నీటి నిల్వలు,డ్రైనేజీలు పొంగిపొర్లడం,చెట్లు కూలడం వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది.మేయర్ ఆదేశాలు,మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర ప్రత్యక్ష పర్యవేక్షణలో నగరవ్యాప్తంగా ప్రత్యేక మాన్సూన్ సన్నద్ధత చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ప్రజల భద్రత,ఆస్తుల రక్షణ కోసం24 గంటల మాన్సూన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.నగరాన్ని టౌన్-1,టౌన్-2గా విభజించి ప్రత్యేక రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు.కమిషనర్ ఆదేశాల మేరకు వార్డు అధికారులు,శానిటరీ జవాన్లు,వాటర్ సప్లై,ఎలక్ట్రీషియన్, హరితహారం,ఇంజినీరింగ్,టౌన్ ప్లానింగ్,రెవెన్యూ,శానిటేషన్ విభాగాలకు చెందిన 150 మందికి పైగా సిబ్బందితో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.ఈ బృందాలు 24 గంటలూ అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయి.ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వెంటనే పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.వర్షపు నీరు ఎటువంటి అవరోధం లేకుండా ప్రవహించేలా నగరంలోని ప్రధాన డ్రైన్లు,కాలువలు,కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల్లో డీసిల్టింగ్ పనులు వేగవంతం చేశారు. డెంగ్యూ,మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని డివిజన్లలో ప్రతిరోజూ ఫాగింగ్,యాంటీ లార్వా స్ప్రేయింగ్,పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు.భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం కాకపోతే ఇళ్ల నుంచి బయటకు రావద్దని కమిషనర్ శరత్ చంద్ర సూచించారు.చెత్తను డ్రైనేజీలు,కాలువల్లో వేయకుండా మున్సిపల్ వాహనాలకే అందించాలని కోరారు.చెట్లు కూలడం,డ్రైనేజీలు మూసుకుపోవడం,నీటి నిల్వలు, తాగునీటి సమస్యలు,వీధి దీపాల లోపాలు వంటివి గమనిస్తే వెంటనే 08682-220100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని,అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైనదని కమిషనర్ తెలిపారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### యోగ శిక్షకులు నారాయణ రాథోడ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 20 (విజన్ ఆంధ్ర) : 2026 జూన్ 21 ఆదివారం నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని యోగ శిక్షకులు నారాయణ రాథోడ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలో శనివారం పెద్ద సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చన్నారు. యోగాను దిన చర్యలో ఒక భాగం చేసుకోవాల్సినఅవసరం ఎంతైనా ఉందన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ పని అయినా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు అనంతయ్య, వీరేశం, భీమ్లా నాయక్, మల్లేశం, పతంజలి కిసాన్ విభాగం జిల్లా అధ్యక్షుడు వీరేషం, వికారాబాద్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు సదానంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలియజేయాలి

### – జిల్లా కలెక్టర్ కె.హరిత

అసిఫాబాద్ జిల్లా ప్రతినిది,జూన్ 20: జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న 'ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ' కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలిసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ భవన సముదాయం నుండి వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా నిర్వహించిన "2ఖ రన్" ను అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ గారితో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఎఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 678 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా మరియు విజయవంతంగా సాగాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (BLO) తప్పనిసరిగా ప్రతి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు మార్పులు చేర్పులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. బిఎల్ఓ యాప్ (BLO App) ద్వారా ఈ వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఎఈ ఓటరు సవరణ ప్రక్రియను ఒక బాధ్యతాయుతమైన కార్యక్రమంగా భావించి, దీని విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు మరియు విద్యార్థులు పూర్తి స్థాయిలో సహకరిస్తూ భాగస్వాములు కావాలని కోరారు. ఓటరు నమోదుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా పాత్ర ఎంతో కీలకమని, పత్రికలు మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారుఈ అవగాహన 2ఖ రన్ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు.ఎకార్యక్రమ కేంద్రాలు: జిల్లా వ్యాప్తంగా ఉన్న 678 పోలింగ్ కేంద్రాలు.దీూ ల ద్వారా ఇంటింటి సర్వే మరియు 'బిఎల్ఓ యాప్' ద్వారా వివరాల నమోదు. చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు జిల్లా పౌర సంబంధాల అధికారి చే జారీ

## ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్ష నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 20 (విజన్ ఆంధ్ర) : నీట్ పరీక్ష అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలను సందర్శించిన అధికారులు పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, సీటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా లో 5 పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పూర్తి స్థాయి లో చెక్ చేయాలనీ ఎస్పీ ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, డి ఎస్ పి అంజయ్య, సిటీ కో ఆర్డినేటర్ సాయి లత, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, నెమతి హోలీ సంబంధిత శాఖల అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## గుండ్ల సింగారంలో పేదల గుడిసెలు కూల్చివేత

### రోడ్డున పడ్డ ఐదేళ్ళుగా నివాసం ఉంటున్న 350 కుటుంబాలు అడ్డుకోబోయిన సిపిఐ నాయకుల అరెస్టు



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 20 (విజన్ ఆంధ్ర) : హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం ఉదయం పోలీసులు, అధికారులు వందలాది మంది నివాసం పేదల గుడిసెలను కూల్చి వేశారు. దీంతో గుండ్ల సింగారంలో రోజంతా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం ఉదయం 5 గంటలకు హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది సుమారు 200 మంది పోలీసుల బందోబస్తుతో హనుమకొండ గుండ్ల సింగారంలోని గుడిసెల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. దీంతో సిపిఐ నాయకులు, గుడిసె వాసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా తమకు కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని అడ్డుకుంటే లీగల్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారని గుడిసె వాసులు వాపోయారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన పోలీసులు,రెవెన్యూ సిబ్బంది ఐదు జేసీబీలతో సుమారు 350 గుడిసెలను నేలమట్టం చేశారు.ఈ సందర్భంగా అడ్డుకోబోయిన సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాగా గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి జీవిస్తున్నామని తమను ఇప్పటికిప్పుడు బయటికి పొమ్మంటే ఎక్కడికి పోవాలని గుడిసె వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉదయం 5 గంటలకు ఇండ్ల కూల్చివేతను అడ్డుకున్న సిపిఐ నాయకులను, కార్యకర్తలను నిర్బంధించి అరెస్ట్ చేసి కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, నాయకులు పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మాలోత్ మంగ, బాలాజీ రంజిత్ లతో పాటు 40 మంది ఉన్నారు.మమ్మల్ని చంపినా ఇక్కడి నుంచి కదిలేదు లేదు: రమ'ఐదేళ్లుగా గుడిసెలు వేసుకొని ఉంటున్నాం. పిల్లలు ఇక్కడి నుంచే బడికి వెళ్తున్నారు. నిన్న అధికారులు ఇక్కడికి వచ్చినప్పటికీ.. ఎలాంటి ఇన్ఫర్మేషన్ ఇవ్వలేదు. ఈరోజు ఉ.4 గం.కే ఇక్కడికి వచ్చారు. పిల్లలు ఉన్నారని చెప్పినా వినిపించుకోలేదు. మహిళలం అని చూడకుండా నెట్టేశారు. ఇంట్లో ఉండగానే రేకులు కూలగొట్టారు. మమ్మల్ని ఇక్కడే చంపండి.. కదిలేదు లేదు' అని గుండ్ల సింగారానికి చెందిన రమ ఆవేదన వ్యక్తం చేశారు.గుడిసెలు కూల్చినా మండుటెండలోనే గుడిసె వాసులుగుండ్ల సింగారం లిక్కర్ ప్లాంట్ సమీపంలో గుడిసెలు తొలగించిన ప్రాంతంలో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నివాసాలు కోల్పోయిన కుటుంబాలు ఎండలోనే తాత్కాలికంగా ఉంటూ అక్కడే వంటలు చేసుకుంటున్నాయి. చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.తమ గుడిసెలను కూల్చి వేసినా తాము ఆ భూమి వదలబోమని స్పష్టం చేశారు.

## రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిఆర్ఎస్ పార్టీ పేట జిల్లా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి



నారాయణపేట, జూన్ 20 (విజన్ ఆంధ్ర) రైతుల పట్ల నిర్లక్ష్యం వహించడం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతవరకు సమంజసం అని నారాయణపేట జిల్లా బి.ఆర్.ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారంనారాయణపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం రైతుల నుంచి పంటలను పూర్తిగా కొనుగోలు చేయమని చెబుతుందని, ఒక గింజ కూడా ఎక్కువగా కొనము అనే విధంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్నపూర్ణగా నిలిపిన రైతులను ఈరోజు కష్టాల్లోకి నెట్టే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో 40 లక్షల ఎకరాల్లో సాగు జరిగితే, 2014 తర్వాత అది 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు పెరిగిందని తెలిపారు. పంజాబ్‌ను తలదన్నే స్థాయిలో పంటలు పండించి ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియా గా పేరొందిన తెలంగాణ రైతాంగం, ప్రస్తుతం కరెంట్, ఎరువులు, నీటి కొరతతో ఇబ్బందులు పడుతోందని పేర్కొన్నారు. నారాయణపేట నియోజకవర్గంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న చిరుధాన్యాలు సాగవుతున్నాయని, ముఖ్యంగా వరి పంటపై ఆధారపడే రైతులకు ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండించొద్దు, మార్కెట్ చేసుకోండి అని చెప్పడం ద్వారా రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు ద్వారా రూ.72 వేల కోట్లు, రైతుభీమా కోసం రూ.6,800 కోట్లు, రుణమాఫీకి రూ.29 వేల కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే గత మూడు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటించి, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి, మొక్కజొన్న, పప్పులు, నువ్వులు, చిరుధాన్యాలు సహా అన్ని పంటలకు సరైన ధర ఇవ్వాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బి ఆర్ ఎస్ పార్టీ రైతులతో కలిసి ఉద్యమం చేస్తుందని, ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమములో పట్టణ, మండల మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ, మండల పార్టీ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## హనుమకొండలో పేదల ఇళ్ళు కూల్చివేత దుర్మార్గం

### గుండ్ల సింగారం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
### ఇండ్ల పట్టాల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు
### నేడు హైదరాబాద్ లో ఇండ్ల స్థలాల సాధనకై అఖిలపక్ష సమావేశం
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 20 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం పేదల ఇళ్ళు కూల్చి వేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గుండ్ల సింగారంలో పేదల ఇళ్ళు కూల్చివేత విషయం తెలుసుకున్న కూనంనేని సాంబశివరావు హుటా హుటిన హైదరాబాద్ నుండి విచ్చేసి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు,జిల్లా సిపిఐ నాయకులతో కలిసి గుండ్ల సింగారంలో సందర్శించారు. ఈ సందర్భంగా గుడిసె వాసులు సిపిఐ నాయకులకు తమ గోడు వెళ్లబోసుకుని, చిన్న పిల్లలు, మహిళలు అని చూడకుండా తమను తమ ఇండ్ల నుండి ఈడ్చి పడేశారని తెలిపారు. అలాగే బియ్యం, ఇతర నిత్యావసరాలను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.కాగా విద్యార్థుల సర్టిఫికేట్ లను సైతం తీసుకోనివ్వకుండా పోలీసులు ఈడ్చుకొని వెళ్లారని విద్యార్థులు తెలిపారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ హనుమకొండ గుండ్ల సింగారంలో ఇండ్లు కోల్పోయిన పేదలకు న్యాయం జరిగే వరకూ తాము అండగా ఉంటామని అన్నారు. భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా స్పందించని అధికారిక యంత్రాంగం నిలువ నీడ లేని పేదలు 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిపై అర్ధరాత్రివేళ దొంగల మాదిరిగా దాడి చేయడం దుర్మమార్గమైన చర్య అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న పేదల పై ప్రతాపం చూపుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించి ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయాలని, నిలుపుదల చేయని ఎడల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయకుంటే హనుమకొండ, వరంగల్ జిల్లాల నుండే రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఇళ్ళ స్థలాల పోరాటం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తాము ప్రభుత్వానికి మిత్ర పక్షంగా ఉన్నప్పటికీ పేదల కోసం ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతామని హెచ్చరించారు.వామపక్షాల ఆధ్వర్యంలో పేదల ఇళ్ళు, ఇండ్ల స్థలాలు, భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిపై ఆదివారం హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ లో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలపై ఒక భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సందర్భంగా గుండ్ల సింగారంలో ఇండ్ల కూల్చివేతకు గురైన బాధితులతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేదలందరూ ఐక్యంగా నిలబడాలని, సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. ఇండ్ల పట్టాలు సాధించే వరకూ విశ్రమించేదిలేదని చెప్పారు.సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జైలుకు అయినా వెళతాము కాని భూమిని వదిలేది లేదన్నారు.భూమి సాధించుకనే వరకు సిపిఐ మీ వెంటనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మేకల రవి, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, సిపిఐ జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, ఏషబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, రాజు కుమార్, అలువాల రాజు, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పోనుగోటి రాము, గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మాలోత్ మంగ, కొడెపాక బాబు, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, బైసా మౌనిక, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, గిన్నారపు రోహిత్, గుగులోత్ సురేష్, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మొండి చేయి పట్టణాభివృద్ధి శూన్యం

### కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఫైర్
### పట్టణ టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుమ్మర్పల్లి గోపాల్ ముదిరాజ్
### మండల టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగల్ల అశోక్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 20 (విజన్ ఆంధ్ర) : బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశాలతో వికారాబాద్ పార్టీ కార్యాలయంలో కుమ్మర్పల్లి గోపాల్ ముదిరాజ్ అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల, పట్టణ స్థాయి బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకపోవడంతో వడ్లు ఇంకా రోడ్ల పైనే తడిసిపోతున్నాయని మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు రైతులకు అనేక వాగ్దానాలు చేసి, ఇప్పుడు పూర్తిస్థాయిలో రైతుబంధు కూడా ఇవ్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. కనీసం యూరియా కూడా అందించకుండా యాప్‌ల పేరుతో తిప్పలు పెడుతున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే స్పీకర్ పదవిలో ఉండి కూడా ఇటు రైతుల ఇబ్బందులను, అటు పట్టణాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. పడిగళ్ళ అశోక్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే స్పీకర్ ముందుచూపుతో వ్యవసాయ అధికారులతో రివ్యూ నిర్వహించి, ప్రతి పంటను కొనుగోలు చేసి, ఎరువులు అందుబాటులో ఉంచాలని, నిలిచిపోయిన పట్టణ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. మీడియా సమావేశంలో దావల్ గారి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు కడియాల వేణుగోపాల్ ముదిరాజ్, అశోక్ కుమార్, గిరీష్ కొఠారి, సుభాన్ రెడ్డి, బురాన్ పల్లి అనిల్, నర్సింహా, జైదుపల్లి సురేష్ ముదిరాజ్, షఫి ఆహిల్ తదితరులు పాల్గొన్నారు.

## ABVP ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు బంద్ కి పిలుపునిచ్చింది

### ` ABVP దుబ్బాక నగర కార్యదర్శి శేర్ల జశ్వంత్

విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ూదీవూ దుబ్బాక శాఖ ఆధ్వర్యంలో స్థానిక సిదార్థ పాఠశాలలో విలేకరుల సమవేశాం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ దుబ్బాక నగర కార్యదర్శి జశ్వంత్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు ూదీవూ పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 27,000ల ప్రభుత్వ స్కూళ్లలో 23,000ల స్కూళ్లను ఎత్తివేసి మూడు లేదా నాలుగు మండలాలకి కలిపి ఒకటే తెలంగాణ పబ్లిక్ స్కూల్ లేదా ఇంటిగ్రేటెడ్ పేరుతో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేయాలనే ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఖాళీగా ఉన్న వీజూ, ఐజూ పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దయనీయ స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, చీజూ 2020 ని అమలు చేయాలని, ప్రైవేట్ స్కూల్ మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్,యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమం లో భారత్,యశ్వంత్,రామ్ పాల్గొన్నారు.

# నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలి

## ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి



భూపాలపల్లి జిల్లా. జూన్ :20 ( విజన్ ఆంధ్ర) శనివారం రోజున భూపాలపల్లి ఏరియాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి , సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి సునీత రాజేశ్వర్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. "కార్యక్రమం ప్రారంభంలో శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన యోగా శిక్షకులు వివిధ యోగాసనాలను ప్రదర్శిస్తూ, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులకు యోగాభ్యాసంపై ప్రత్యక్ష శిక్షణ అందించి, నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.'' ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, యోగ అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని అన్నారు. నేటి వేగవంతమైన జీవన విధానంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం అరగంట సమయం యోగాభ్యాసానికి కేటాయించాలని సూచించారు. యోగ చేయడం ద్వారా ఒత్తిడి తగ్గడంతో పాటు ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెరుగుతాయని, అనేక రకాల వ్యాధులను దూరం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని, యోగా వంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం యోగా శిక్షకులను అభినధిస్తూ జియం శాల్వ తో సన్మానిచ్చారు. ఈ కార్యక్రమానికి గుర్తింపు సంఘం ఏ ఐ టి యు సి బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియూసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బి .మధుకర్ రెడ్డి , సి ఎం ఓ ఏ ఐ ప్రెసిడెంట్ నజీర్, ఏజీఎం (సివిల్) రవికుమార్ , ఏజీఎం (ఐ ఈ డీ ) జోతి , డీజీఎం (ఎఫ్&ఏ) శ్రీ పి. రాజేశ్వర్, డీజీఎం (క్వాలిటీ) కృష్ణ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందర్ , ఎన్విరాల్మెంట్ ఆఫీసర్ టి. పోషమల్లు, ఏరియా సర్వే ఆఫీసర్ శైలేంద్ర కుమార్, అన్నీ డిపార్ట్మెంట్ల అధికారులు, ఉద్యోగులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# మాస్టర్ ఈ కే ఆర్గనైజేషన్ కొత్తగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో రామవరం 16వ డివిజన్‌లో గ్రామ సేవా యజ్ఞం

## శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఉచిత హోమియో వైద్య శిబిరం 100 మందికి మందుల పంపిణీ

కొత్తగూడెం బ్యూరో జూన్ 21(విజన్ ఆంధ్ర)మాస్టర్ ఈ కే ఆధ్యాత్మిక సేవా సంస్థ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని రామవరం 16వ డివిజన్‌లో గ్రామ సేవా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. నాగయ్య గడ్డలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సేవా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ ఇ.కే ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం బ్రాంచ్ ఫౌండర్లలో ఒకరైన శ్రీ రవిచంద్ర ఆధ్వర్యం వహించగా, 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో రామవరం ప్రాంత ప్రజలకు వారి ఆరోగ్య సమస్యలను పరిశీలించి, కేస్ షీట్లు రూపొందించి, దీర్ఘకాలిక శారీరక సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 100 మంది రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర



మాట్లాడుతూ, "ఆరోగ్యానికి కేవలం ఔషధ సేవ మాత్రమే కాదు, సరైన ఆహారం, విహారం, ప్రకృతితో మరియు తోటి వ్యక్తులతో సానుకూలంగా వ్యవహరించడం కూడా ముఖ్యమని" తెలిపారు. జీవనశైలిలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఈ కే ఆధ్యాత్మిక సేవా సంస్థ సభ్యులు జి. లత, ఆర్. రామారావు, కె. శ్రీనివాసరెడ్డి, కె. స్వామి, సౌజన్య, వీరమల్లు, పి. శ్రీధర్ రావు, బి. కోటేశ్వరరావు, కె. కమల, నాగేశ్వరరావు, బి. వి. చారి, ఎస్. మనోహర్ కుమార్, కె. శ్రీనివాస్, ఎండి ఫజల్‌తో పాటు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ నిర్వాహకులు ఫణి కుమార్, పితాని అబ్బులు, జూపాక రమేష్, నజీర్, పాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగత ప్రభుత్వ పాలనతో సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించిన ఐఏఎస్ అధికారి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి20 సిద్దిపేట జిల్లా లో 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంపై పర్యవేక్షణకు జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడ్డ సీనియర్ ఐఏఎస్ అధికారి అహ్మద్ నదీమ్ ఈనెల 22వ తేదీ సోమవారం రోజున ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష కార్యక్రమం నిర్వహించనున్నందున సోమవారం రోజు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు ప్రజావాణి కార్యక్రమం కోసం ఈనెల 22వ తేదీ సోమవారం నాడు కలెక్టరేట్ కు ఎవరు రాకూడదని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# గాంధీజీ విద్యాసంస్థల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



చండూర్,జూన్20,(విజన్ ఆంధ్ర)అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చండూరులోని గాంధీజీ విద్యాసంస్థల్లో శనివారం విద్యార్థులతో ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా యోగా ఆసనాలు,ప్రాణాయామాలు చేసి యోగా విశిష్టతను చాటిచెప్పారు. గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ,యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు శారీరకంగా దృఢంగా,మానసికంగా ప్రశాంతంగా ఉండాలంటే యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి,ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ బోడ సాయిరాం ఆధ్వర్యంలో విద్యార్థులు ముందుగా వార్మ్-అప్ వ్యాయామాలు చేశారు. అనంతరం తాడాసనం, వృక్షాసనం,త్రికోణాసనం, భుజంగాసనం,వజ్రాసనం, పద్మాసనం వంటి యోగా ఆసనాలు అభ్యసించారు. ప్రాణాయామం ,అనులోమ-విలోమం,భ్రమరి వంటి శ్వాస వ్యాయామాల ద్వారా యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. యోగా సాధనతో శారీరక దృఢత్వం,మానసిక ప్రశాంత,ఏకాగ్రత,జ్ఞాపకశక్తి పెంపొందుతుందని విద్యార్థులకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న,ప్రిన్సిపల్ జానీ సార్,ప్రైమరీ ప్రిన్సిపల్ పులిపాటి రాధిక,కందుల కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు

# మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం

## డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దాం.. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 20..మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. యువతను మత్తు బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా కరీంనగర్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించవచ్చని పేర్కొన్న ఆమె, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, ఈ నెల 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు, గ్రామ సభల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన




కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి విద్యార్థులతో పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం, విద్యాసంస్థలను సందర్శించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 26న ర్యాలీలు, గ్రామ సభలు, డ్రగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్ షాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీఓ) పర్వీన్ మాట్లాడుతూ, "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అనంతరం "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులుగా మారిన ఎస్పీ నరసింహ

## ఉత్తరధృవం.. దక్షిణధృవం పాఠం నేర్పి.. సర్కారు పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య.. పూర్వపు వృత్తిని గుర్తుచేసుకుని విద్యార్థులకు పాఠాలు బోధించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ..

సూర్యాపేట జూన్ 20:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట పట్టణంలో శనివారం ఎస్పీ నరసింహ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను సందర్శించి ఎనిమిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరో మారు తన పూర్వపు ఉపాధ్యాయ వృత్తిని గుర్తుచేసుకొని ఉత్తరధ్రువం.. దక్షిణధ్రువం.. అంటూ సాంఘికశాస్త్రం పాఠాలను ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు బోధించారు. ఎస్పీ చెప్తున్న పాఠాలను విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. జూనియర్ అసిస్టెంట్ కు సన్మానంతాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలనందే తన కుమారుడు రుత్విక్ ను చెప్పించిన జూనియర్ అసిస్టెంట్ హరితను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన అనుభవిజ్ఞులైన నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని పిల్లలకు అర్థమయ్యే రీతిలో సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తారని తెలిపారు.



కావున తల్లిదండ్రులు విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం కోసం ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని కోరారు. చెడు అలవాటులకు దూరంగా ఉండాలని మంచి స్నేహితులను మంచి పుస్తకాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు నైపుణ్యంతో విద్యార్థులకు పాఠాలు బోధించాలని సర్కారు బడుల ప్రాముఖ్యతను సామర్థ్యాన్ని తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమం అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ పట్టణ సిఐ వెంకటయ్య,ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

# యూరియా యాప్ వద్దు నేరుగా రైతులకే ఇవ్వడం ముద్దు...

## -జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ నాయకుల ధర్నా

భూపాలపల్లి జిల్లా 20 జూన్. (విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో భూపాలపల్లి నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ,రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి రైతులపట్ల తన దుర్బుద్ధి ప్రదర్శించారు. ఎన్నికల సమయంలో రైతులు పండించిన ప్రతి గింజ మేమే కొంటామని సన్న,దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పి రైతులతో ఆటలు ఆడుతున్నది ఈ ప్రభుత్వం. మరీ యూరియా ఇవ్వకుండా రైతులను రోడ్లపై పడిగాపులు కాసేలా చేసి, రైతులకు మేలు చేస్తామని యూరియా యాప్ తీసుకొచ్చింది . చదువురాని. రైతు పట్ల పెద్ద శాపంగా మారింది. నేడు కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొంటేనే రాష్ట్ర ప్రభుత్వం కొంటుంది అని చెప్పి రైతు బతుకులను మళ్ళీ దళారుల చేతికి అప్పగించే ప్రయత్నం చేస్తుంది. రైతులకు 24 గంటల కరెంట్ బదులు మళ్ళీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి కష్టాలు గుర్తు చేసేలా నేటి ప్రభుత్వం దుర్మార్గమైన ఆలోచన చేస్తుంది అని ఆరోపించారు. ఈ



సందర్భంగా రైతు పండించిన ధాన్యం ప్రతి గింజను కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని,24గంటల కరెంట్ ఇవ్వాలని యూరియా యాప్ వద్దు నేరుగా రైతులకే ఇవ్వాలని ఒక్క ప్రణాళిక బద్దంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ,రేవంత్ రెడ్డి రైతుల పట్ల చేస్తున్న ద్వంద వైఖరిని మార్చుకోవాలని లేదంటే త్వరలోనే ఈ ప్రభుత్వాన్నికి బుద్ధి చెప్పే కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

# అక్రమాలకు అడ్డాగా మారిన బిట్స్ పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి ఏఐఎస్ఎఫ్




భూపాలపల్లి జిల్లా/ 20 జూన్ ( విజన్ ఆంధ్ర) భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని బిట్స్ పాఠశాలకు సంబంధించిన బుక్ స్టాల్ సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు. బిట్స్ పాఠశాల పై చర్యలు తీసుకుంటాం డీఈవో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, అనుమతులు లేకుండా బుక్ స్టాల్ నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న బిట్స్ పాఠశాల యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోత్కు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బుక్ స్టాల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు బుక్ స్టాల్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆందోళన నేపథ్యంలో స్పందించిన మున్సిపల్ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని అక్రమంగా నిర్వహిస్తున్న బుక్ స్టాల్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ, విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. పధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆందోళన విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మండల విద్యాశాఖ అధికారి దేవ నాయక్ లు సంఘటన స్థలానికి చేరుకుని ఏఐఎస్ఎఫ్ నాయకులతో మాట్లాడారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. బిట్స్ పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి హామీ ఇచ్చారు. విద్యను వ్యాపారంగా మార్చిన ఏ విద్యాసంస్థనైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. అక్రమ ఫీజులు, బలవంతపు పుస్తకాల విక్రయాలు, అనుమతులు లేని వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యురాలు జడల రాజేశ్వరి, డెబ్బెట్ట శరత్, ఉల్లేరావు బన్నీ, పొన్నగంటి రాజేష్, దొంతుల సురేష్ జంపాల పవన్ నవీన్ రాకేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం కిసాన్ నిధులను వ్యవసాయ అవసరాలకే వినియోగించాలి

## కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం 80 మంది రైతులకు విత్తనాల పంపిణీ

కొత్తగూడెం బ్యూరో జూన్ 21(విజన్ ఆంధ్ర)కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో శనివారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 23వ విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చుంకగుపల్లి మండలం అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీ పరిధి నుంచి సుమారు 80 మంది రైతులు హాజరయ్యారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. టి. భరత్ మాట్లాడుతూ రైతుల ఖాతాల్లో జమవుతున్న పీఎం కిసాన్ నిధులను వ్యవసాయ విత్తనాలు, ఎరువుల కొనుగోలు మరియు సాగు పనుల కోసం వినియోగించాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకొని, పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఎరువులను వినియోగించాలని తెలిపారు. మోతాదుకు మించి ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగుపై దృష్టి పెట్టాలని సూచిస్తూ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన డబ్ల్యూజీఎల్ 44 (సిద్ది), కెఎన్ఎం 1638 రకాల సాగు ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త శివ మాట్లాడుతూ రైతుల కోసం కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, ఆధునిక సాగు పద్ధతులు, శిక్షణా కార్యక్రమాలు, వాతావరణ సమాచారం, పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ వంటి అంశాలపై నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఆయిల్ పామ్, మునగ సాగుతో పాటు పందిరి విధానంలో తీగజాతి కూరగాయల సాగు చేపట్టి స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో కోరోమండల్



ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆగ్రోనామిస్ట్ డా. వెంకటేష్, మార్కెటింగ్ ఆఫీసర్ రాజేష్ పాల్గొని ఎరువుల వినియోగంపై వివరాలు తెలియజేశారు. అనంతరం ఎస్సీ ఉప ప్రణాళిక పథకం కింద 80 మంది రైతులు, మహిళా రైతులకు నాణ్యమైన వరివిత్తనాలు కెఎన్ఎం1638 పంపిణీ చేశారు.

# బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

### శ్రీరాముడి చిత్రంపై చెప్పు
### నిరసనగా ఢాకాలో హిందువుల భారీ ర్యాలీ

ఢాకా,జూన్20: బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు. తమ మతవిశ్వాసాలను అవమానించిన వారిని 72 గంటల్లోగా అరెస్టు చేయాలని అల్టిమేటమ్ జారీ చేశారు. లేని పక్షంలో నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు.

## నీట్ ఎగ్జామ్ సెంటర్ లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, జూన్ 20 :( విజన్ ఆంధ్ర ) ఈ నెల 21వ జరగనున్న నీట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ను పురస్కరించుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని నాగారంలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. ప్రశ్న పత్రాలను తరలించే రూట్ మ్యాప్ ను సైతం స్వయంగా పరిశీలించారు. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు మధ్యన పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అభ్యర్థులను లోనికి అనుమతించాలని, అభ్యర్థులతో పాటు సిబ్బంది కూడా ఏ ఒక్కరూ సెల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తేకూడదని అన్నారు. కాగా, విద్యార్థులు ఇబ్బంది పడకుండా పరీక్షా కేంద్రాల్లోని ఆయా గదుల వివరాలను తెలియజేసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి వసతితో పాటు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎం లను నియమించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. ఏ చిన్న తప్పిదానికి సైతం అవకాశం లేకుండా నీట్ ప్రవేశ పరీక్షను పక్కాగా నిర్వహించాలని, సీ.సీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 5.15 గంటల వరకు ఎంట్రన్స్ ఎగ్జామ్ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## నిరంజన్ కుటుంబానికి బండ్ల గణెళిశ్ అండ

### 5లక్షల సాయంగా చెక్కు అందచేత

హన్మకొండ,జూన్20 ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న హనుమకొండ బాలుడు నిరంజన్ కుటుంబానికి ప్రముఖ చిత్ర నిర్మాత బండ్ల గణెళిష్ 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. శనివారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి బండ్ల గణెళిష్ వెళ్లారు. నిరంజన్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ తరఫున ఐదు లక్షల రూపాయల చెక్‌ను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పవన్ కల్యాణ్ భక్తుడిగా.. ఆయన స్ఫూర్తితో నిరంజన్‌కు ఆర్థిక సాయం చేశాను. దైవసమానులైన పవన్ కల్యాణ్ పరామర్శతో నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. మేమందరం ఇలా ఉన్నామంటే పవన్ కల్యాణ్ దయతోనే. నా కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నా. ఈ రోజు వచ్చి ఆర్థిక సాయం చేయాలనుకున్నాను. నారా భువనేశ్వరి పుట్టిన రోజున ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉంది. నిరంజన్ బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడను' అని అన్నారు.

## ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి చిరుత

### కుక్కను చంపి తీసుకెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డు

ముంబై,జూన్20: ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి ఓ చిరుత ప్రవేశించింది. స్టాఫ్ హాస్టల్ ఏరియాలో ఓ కుక్కను చంపేసింది. పోవాయ్‌లో ఉన్న వర్సిటీ సీసీ కెమెరాలకు ఆ ఘటన చిక్కింది. ఈ ఘటన 19వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు జరిగింది. క్యాంపస్‌లోకి చిరుత ప్రవేశించడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లోని రెసిడెన్షియల్ ఏరియాలో చిరుత సంచరిస్తున్నట్లు ఇప్పటికే ఫిర్యాదు ఉన్నది. హాస్టల్ మెట్ల వద్ద ఉన్న ఓ కుక్కను చిరుత తన నోటితో పట్టి చంపేసింది. చాలా నెమ్మదిగా వాకింగ్ చేసుకుంటూ వచ్చిన ఆ చిరుత సడెన్‌గా కుక్కపై దాడి చేసింది.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి: కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, జూన్ 20 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో జూనియర్ లెక్చరర్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "నాణ్యమైన విద్య – ఉజ్వల భవిష్యత్తు" అనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా లెక్చరర్లలో బోధనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ నెల రోజుల శిక్షణా తరగతులను రూపకల్పన చేసినట్లు వివరించారు. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు నూతన బోధనా పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు. నెల రోజులకు పైగా సాగే ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని లెక్చరర్లందరూ పూర్తి బాధ్యతతో, శ్రద్ధతో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, తెలంగాణ మైనారిటీస్ సంక్షేమ గురుకులాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల జూనియర్ లెక్చరర్లు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ ఎమ్మెల్యే నిప్పులు!!

### రైతుల నెత్తిన పిడుగు వేశారు
### చివరి గింజ హామీ ఏమైంది?
### కేంద్రం టార్గెట్ దాటితే పంటను ఎవరు కొంటారు?
### నష్టానికి బాధ్యులెవరు?, భరోసా ఎవరు?
### ప్రతి గింజనూ గిట్టుబాటు ధరతో కొనాలి



కోరుకంటి చందర్‌పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 20 (విజన్ ఆంధ్ర):ఎన్నికల వేళ 'రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం' అంటూ ప్రగల్భాలు పలికి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు పంటల కొనుగోళ్ల బాధ్యత నుండి చేతులెత్తేసి రైతాంగం నెత్తిన పిడుగు వేసిందని రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ అత్యంత ఘాటుగా ధ్వజమెత్తారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకే ధాన్యం, మక్కజొన్న, జొన్నలు, కందులు, పెసర్లు కొనుగోలు చేస్తామంటూ రాష్ట్ర మంత్రులు ప్రకటించడం దారుణమని, ఇది రైతాంగానికి కాంగ్రెస్ చేసిన నమ్మకద్రోహమని మండిపడ్డారు. ఓట్ల కోసం అడ్డగోలు హామీలిచ్చి, అధికారంలోకి రాగానే కేంద్రంపై సాకులు నెడుతూ తప్పించుకోవడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని విమర్శించారు. కేంద్ర టార్గెట్‌కు మించి పండిన పంటను ఏంచేయాలి? అన్నదాతలను ప్రైవేట్ వ్యాపారుల దోపిడీకి బలిచేస్తారా? అని నిలదీసిన ఆయన, రైతులకు నష్టం వాటిల్లితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. రైతు సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్, తక్షణమే మాట మార్చడం ఆపి, పండించిన ప్రతి గింజకూ గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఉధృత పోరాటాలు తప్పవని చందర్ తీవ్రంగా హెచ్చరించారు.

## అన్యాక్రాంతం అవుతున్న సీలింగ్ భూమిని కాపాడాలి



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 20÷సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని భూమి సర్వే నెంబర్ 1189లో 1973 సంవత్సరంలో పివీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో భూ పరిమితి చట్టం కింద పట్టేదారు అయిన రామచంద్రారెడ్డి సీలింగ్ భూమి కింద ప్రభుత్వానికి ఎనిమిది ఎకరాలా భూమిని ఇచ్చినారని సిపిఐ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ అట్టి భూమిలో 1989-90లో మావోయిస్టులు అమరుల స్తూపం నిర్మించగా మావోయిస్టుల ప్రాబల్యం తగ్గడంతో ప్రభుత్వానికి ఇచ్చిన సీలింగ్ భూములో పట్టణ నడిబొడ్డున ఉన్న భూముల విపరీతంగా పెరగడంతో అట్టి సీలింగ్ భూమిని పట్టేదార్ మల్లి రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పట్టేదారు వారసులు చేతులు కలిపి అట్టి భూమిలో అన్యాక్రాంతంగా అనుమతులు లేకుండా ఇండ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇట్టి సీలింగ్ భూమిలో అమరుల శృతి వనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారని లేదా ప్రభుత్వ కార్యాలయాలను కూడా నిర్మించవచ్చని అన్నారు. ఇట్టి కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతంపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్య నారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు గూడ పద్మ,పొదిల కుమారస్వామి జంగ విజయ అయిలేని మల్లారెడ్డి పాటు పలువురు పాల్గొన్నారు.


## ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలి -ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, జూన్ 20 (విజన్ ఆంధ్ర): పోలీసు యంత్రాంగం గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలని, బీట్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, పట్టణ గ్రామ స్థాయిలో సమాచార సేకరణ చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని శనివారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు. సిబ్బందిచే గౌరవ వందనాన్ని స్వీకరించి, కార్యాలయ ఆవరణ, వివిధ విభాగాలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులు, నేరాల వివరాలను, రికార్డులను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారుల ద్వారా సత్వర పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించినప్పుడే పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, కేసుల విచారణను నాణ్యతతో పూర్తి చేసి నిర్దేశిత గడువులోపు చార్జిషీట్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఆర్ఎంఎస్ ఎప్పటికప్పుడు నవీకరణ, సిడిఓ, బ్లూ కోర్ట్, పిటిషన్ పిటిషన్ మేనేజ్మెంట్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను చైతన్యపరుస్తూ నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో అదనపు పెట్రోలింగ్ వాహనాలతో గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలు, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయంలో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ రికార్డుల నిర్వహణను క్రమబద్ధీకరించాలని, ఎటువంటి పెండెన్సీలు లేకుండా పనితీరును మెరుగుపరచాలని సూచించారు. సిబ్బంది విధుల నిర్వహణను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, జి. శ్రావణ్, జె. ఫణిధర్, డి. గురుస్వామి, బి.డి. ప్రేమ్ కుమార్, ప్రణయ్ కుమార్, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వివాదాల పరిష్కారానికి దివ్యౌషధం!!

### గోదావరిఖనిలో ఘనంగా లోక్ అదాలత్
### పెండింగ్ కేసుల పరిష్కారంలో భాగస్వాములైన న్యాయవాదులు, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్లు
### పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్ సింగ్, మున్సిఫ్ మేజిస్ట్రేట్లు, ఏసీపీలు



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 20 (విజన్ ఆంధ్ర):న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే పనిలేకుండా, ఇరువర్గాల అంగీకారంతో సత్వర న్యాయాన్ని అందించే అద్భుత వేదికగా లోక్ అదాలత్ నిలిచింది. గోదావరిఖనిలో జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వివిధ కోర్టులలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్ సింగ్, మున్సిఫ్ మేజిస్ట్రేట్లు నల్లాల వెంకట సచిన్ రెడ్డి, రామగిరి స్వాతికలు ప్రత్యేకంగా మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా ఎలాంటి మనస్పర్థలు లేకుండా, అత్యంత వేగంగా సత్వర న్యాయం సాధ్యపడుతుందని వారు ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టం చేశారు. ఈ మహత్తర కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహీదా ఫర్వీన్, లోక్ అదాలత్ సభ్యులు నడిపల్లి కిషన్ రావు, కుడిది వెంకటేష్, రాజ్యలక్ష్మి, తిలక్, గుజ్జేటి సత్యనారాయణ తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. వీరితో పాటు బోడ సమ్మయ్య, గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు ముడత రమేష్, గజ్జి కృష్ణలు కూడా హాజరై కార్యక్రమ విజయవంతానికి తోడ్పడ్డారు. వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన కోర్ట్ డ్యూటీ ఆఫీసర్లు, సీనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెండింగ్ కేసుల పరిష్కారానికి తమ వంతు కృషి చేశారు. రాజీ మార్గమే రాజమార్గమని నిరూపిస్తూ, ఎన్నో వివాదాలు ఈ వేదికపై సామరస్యపూర్వకంగా ముగిసిపోవడం విశేషం. కోర్టు ఖర్చులు, సమయం వృథా కాకుండా చూసుకోవడానికి ఇదొక చక్కటి అవకాశమని అధికారులు కొనియాడారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రశాంత జీవితాన్ని గడపాలని న్యాయమూర్తులు పిలుపునిచ్చారు. చట్టపరమైన చిక్కుల నుండి సామాన్యుడికి ఉపశమనం కలిగించేలా సాగిన ఈ లోక్ అదాలత్ ఎంతో మంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందని చెప్పవచ్చు. విద్వేషాలను విడనాడి, స్నేహపూర్వక వాతావరణంలో సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇటువంటి వేదికలు ఎంతో అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ విధంగా గోదావరిఖనిలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమం ప్రజల ఆదరణతో, అధికారుల సమన్వయంతో అత్యంత విజయవంతంగా ముగిసింది.

## కాకతీయ ఆస్పత్రిపై దాడిని తీవ్రంగా ఖండించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ

### వైద్యులపై దాడులు సహించం.. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి
### ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. ఆశోక్ కుమార్




బోడుప్పల్,జూన్ 20 (విజన్ ఆంధ్ర): రోగులకు నిస్వార్థంగా వైద్య సేవలు అందిస్తున్న కాకతీయ ఆస్పత్రిపై జరిగిన దాడిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఇఎంఏ) ఉప్పల్ శాఖ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రులు, వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు చేయడం సమాజానికి మంచిది కాదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యులపై దాడులు చేయడం బాధాకరమని అన్నారు. కాకతీయ హస్పిటల్ లో జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో పరిష్కరించుకోవాలని, హింసాత్మక చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఆస్పత్రుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాకతీయ హస్పిటల్ పై దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప్పల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. ఆశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.వి. ప్రసాద్, సభ్యులు డాక్టర్ వేణుగోపాల్ రావు, డాక్టర్ మహేష్ రెడ్డి, డాక్టర్ మాధవి, కాకతీయ ఆస్పత్రి సీఈవో టి. హరిప్రసాద్, డాక్టర్ సతీష్, డాక్టర్ సంతోష్, కాకతీయ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కవిత బొగ్గుబాయి బాటలో ఉద్రిక్తత

### భూపాల్‌పల్లిలో అడ్డుకున్న పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి,జూన్20: టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేపట్టిన బొగ్గుబాయి బాట ఉద్రిక్తతలకు దారితీసింది. సింగరేణి కేటీకే-5 ఇంక్లైన్ గని వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా 'తెలంగాణ రక్షణ సేన' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేటీకే-5 ఇంక్లైన్ గనికి చేరుకున్నారు. అయితే గని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కవితను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

## అయిజ పోలీస్ స్టేషన్‌కు రాజకీయ గ్రహణం

అయిజ జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ పట్టణ పోలీస్ స్టేషన్ రాజకీయ ఒత్తిళ్లకు వేదికగా మారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీస్ స్టేషన్‌కు రాజకీయ గ్రహణం పట్టిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం తరచూ సబ్-ఇన్‌స్పెక్టర్లు (ఎస్సైలు) మారడమే అని పట్టణ ప్రజలు అనుకుంటున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో ఆ నేత హవా..?అయిజ పోలీస్ స్టేషన్ పరిధిలో అలంపూర్ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ ముఖ్య నేత ఒకరు తెరవెనుక ఉండి మొత్తం చక్రం తిప్పుతున్నారనే టాక్ బలంగా వినిపిస్తోంది. సదరు నేత చెప్పినట్లే ఇక్కడ పోలీస్ యంత్రాంగం నడుచుకోవాలనే ఒత్తిళ్లు ఉన్నాయని, ఆ నాయకుడి కనుసన్నల్లోనే బదిలీల పర్వం సాగుతోందని నియోజకవర్గంలో ఇప్పుడు బహిరంగంగా చర్చ జరుగుతోంది. చెప్పినట్టు వినకపోతే వీఆర్‌కేఇక్కడికి వచ్చే అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు తీవ్రంగా ఉంటున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాము చెప్పినట్లు వినని అధికారులను లూప్ లైన్‌కు లేదా వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు పంపించడం, లేదంటే ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించడం సదరు నాయకులకు మంచినీళ్లు తాగినంత సులువుగా మారిందని విమర్శిస్తున్నారు. కీలుబొమ్మగా మారిన పోలీస్ వ్యవస్థ...ప్రజల్లో అసంతృప్తి..రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాలు , మితిమీరిన జోక్యం వల్ల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించాల్సిన పోలీస్ వ్యవస్థ, కొంతమంది చేతిలో కీలుబొమ్మగా మారుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారుల వరుస బదిలీల వల్ల స్థానిక సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, శాంతిభద్రతలపై దీని ప్రభావం పడుతోందని పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# మానవుని మనగడకు మొక్కలే జీవనాధారం

## మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ





కొత్తకోట జూన్ 20 (విజన్ ఆంధ్ర): కొత్తకోట : కొత్తకోట పట్టణ కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మాకే నామ్ సే ఏక్ పేడ్ అనే కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పాల్గొని మొక్కలను నాటి నీళ్ళు పోశారు. అదేవిధంగా విద్యార్థినీ, విద్యార్థులతో పర్యావరణానికి పరిరక్షించాలని సూచించారు. జూన్ 2024లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. మనకు జన్మనిచ్చిన అమ్మపై ఉన్న ప్రేమ, గౌరవానికి ప్రత్యేకగా ప్రకృతిమత సంరక్షణ కోసం ప్రతి ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటాలని ఈ పథకం చెబుతున్నది అని తెలిపారు. దేశవ్యాప్తంగా వందల కోట్ల మొక్కలను నాటడం ద్వారా భూమిపై పచ్చదనాన్ని పెంచడం జరుగుతుందని అన్నారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమాంగా కాకుండా, సామాన్య ప్రజలు, విద్యార్థులు అందరూ భాగస్వాములు కావాలన్నారు. చెట్లను పెంచడం వలన ప్రయోజనాలు వాతావరణం లో పెరుగుతున్న కార్బన్ ఉద్గరాలను తగ్గించవచ్చు. వర్షాపాతం మెరుగవుతుంది. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. పక్షులు కీటకాలు మరియు ఇతర జీవులకు ఆవాసం లభిస్తుంది. కార్యక్రమం ద్వారా కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని ఒక తల్లి తన బిడ్డను చూసుకున్నట్టుగా జాగ్రత్తగా చూసుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాలమూరు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి, డోకూర్ పవన్ కుమార్, పద్మజా రెడ్డి, కొండా ప్రశాంత్ రెడ్డి, కొమ్ము భరత్ భూషణ్, సబిరెడ్డి నారాయణమ్మ వెంకట్ రెడ్డి, దాబా శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి గాయత్రి కిసత్యం సాగర్, నవీన్, ఆర్మీ బాలస్వామి, ఆవుల రాఘవేంద్ర గౌడ్, స్టార్ బాలు, గందు రవీందర్ గౌడ్, రాజారామ్ యాదవ్, చిలుకటి చిన్న యాదిరెడ్డి, రవీందర్ రెడ్డి, మద్దిగట్ల శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు వివేకానంద , నిర్మల , పాఠశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ చెక్కులు పంపిణీ చేసిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి



అట్లూరు, జూన్ 20 (విజన్ ఆంధ్ర) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి విడత అన్నదాత సుఖీభవ –పీఎం కిసాన్ ఆర్థిక సహాయ పంపిణీ కార్యక్రమం అట్లూరు మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో శనివారం ఉదయం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసిబి చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేల్ రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ పాల్గొన్నారు సూర్యనారాయణ రెడ్డితో కలిసి ఆర్డీవో చంద్రమోహన్ గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమాన్ని వీక్షించారు ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ 2006–2007 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు 2026–2027 కు సంబంధించి తొలి విడత రాష్ట్ర ప్రభుత్వం తరఫున 5 వేలు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా 2 వేలు మొత్తం కలిపి 7 వేలు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం రైతులకు పెట్టుబడి సాయంగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు వ్యవసాయ వ్యయాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం రైతులకు ఎంతగానో అండగా నిలుస్తుంది అన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమికి చెందిన జనసేన, బిజెపి నాయకులు, ప్రజలు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఫిక్స్డు డోసం కాంబో ఔషధాలతో ముప్పు

## 16 ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ,జూన్20:వైద్యపరంగా సరైన ఆధారాలు లేవని, చికిత్సలో ప్రత్యేక ప్రయోజనం లేదని నిపుణుల కమిటీ నిర్ధారించిన 16 ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల తయారీ, అమ్మకం, పంపిణీపై కేంద్రం నిషేధం విధించింది. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం కింద, ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ఈ మందుల తయారీ, అమ్మకం, పంపిణీని తక్షణమే నిషేధించింది. రెండు లేదా అంతకంటే ఎక్కువ ఔషధ పదార్థాలను ఒకే మాత్ర లేదా సిరప్ రూపంలో కలిపి తయారు చేయడాన్ని ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ అంటారు. అయితే కొన్ని కాంబినేషన్లు రోగులకు అదనపు ప్రయోజనం కలిగించకపోగా, ఆరోగ్య సమస్యలు సృష్టించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. కమిటీ సిఫార్సుల ఆధారంగా, 16 కాంబినేషన్లు అహేతుకమైనవని, వాటిని కొనసాగించడం ప్రయోజనకరం కాదని ప్రభుత్వం నిర్ధారించింది. నిషేధిత జాబితాలో యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ, కడుపు తిమ్మిర్లకు ఉపయోగించే మందులు, కలబంద ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి.

# రైతుల సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం

## నీటిపారుదల ప్రాజెక్టుల పై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, ఎంపీ , ఎమ్మెల్యేలు



గద్వాల జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాగర్ కర్నూల్ నియోజకవర్గం లో జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు నీటిపారుదల ప్రాజెక్టులపై సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు , నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక బోర్డు చైర్మన్ చిన్నారెడ్డి ,గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్,వివిధ జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ జిల్లా స్థాయి అధికారులు వివిధ శాఖలు సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రివర్యులు మాట్లాడుతూజోగులాంబ గద్వాల జిల్లా లో గద్వాల నియోజకవర్గం, అలంపూర్ నియోజకవర్గం నీటిపారుదల ప్రాజెక్టు రిజర్వాయర్లపై సమీక్ష నిర్వహించారు. గద్వాలలో నెట్టెంపాడు రిజర్వాయర్, గుడ్డెం దొడ్డి రిజర్వాయర్, సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం సంబంధించిన వాటిపై త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నెట్టెంపాడు రిజర్వాయర్లు ఉన్న సమస్యలను త్వరగా పూర్తిచేసే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గుడ్డెం దొడ్డి రిజర్వాయర్లు నందు సీఎం పరిశీలించి వెళ్లారు, త్వరలోనే భూ సేకరణ పూర్తిచేసి అదేవిధంగా నీటి సామర్థ్యాన్ని పెంచే విధంగా కృషి చేస్తాము. ప్రభుత్వం త్వరలోనే కావలసిన నిధులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసే విధంగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని అన్నారు. గట్టు ఎత్తిపోతల పథకం నీటి ప్రాజెక్టును కూడా నీటి సామర్థ్యం పెంచి 30 వేలు ఎకరాలకు నీళ్లు అందించే విధంగా కృషి చేయడం జరుగుతుంది త్వరలోనే గట్టు ఎత్తిపోతల పథకం పనులను కూడా ప్రారంభించి రైతులకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. అలంపూర్ నియోజకవర్గం లో కూడా ఆర్డిఎస్ తుమ్మెళ్ళ నీళ్లు అందిస్తే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది సీఎం దృష్టికి తీసుకెళ్లి మా ప్రాంత రైతులకు కూడా నీళ్లు అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూగద్వాల నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి అని అన్నారు. ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీ ని సమస్యలను త్వరగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు పంటలకు నీళ్లు అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. లీకేజీ వల్ల నీటి సమస్య ఉన్నది నాలుగు టిఎంసిల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు ప్రస్తుతం రెండు టీఎంసీల వరకు నీళ్లు నిలువ చేయడం జరుగుతుంది. కాబట్టి లీకేజీ సమస్యలను త్వరగా పరిష్కరిస్తే నాలుగు టీఎంసీల సామర్థ్యంతో నీళ్లు ఉండడం ఉంచితే రైతులకు రెండు పంటలకు నీళ్లు అందించడానికి సాధ్యమవుతుందని తెలిపారు. అదేవిధంగా గుడ్డెందొడ్డి రిజర్వాయర్ వన్ పాయింట్ వన్ టిఎంస్ ఉన్న నీటి సామర్థ్యాన్ని 15 టిఎంసిల నీటి సామర్థ్యాన్ని పెంచడం వల్ల గద్వాల అలంపూర్, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా రైతుల నీటి సమస్య పరిష్కారం కావడం జరుగుతుందని పేర్కొన్నారు. గట్టు ఎత్తిపోతల పథకం ఇప్పటివరకు దాదాపుగా 40 శాతం పనులు పూర్తి కావడం జరిగింది. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మిగతా పనులను కూడా పూర్తి చేస్తే గద్వాల నియోజకవర్గంలోని రైతులకు నీళ్లు సులభంగా అందుతుంది, రైతులకు చివరి ఆయకట్టు వరకు రెండు పంటలు పండించుకోవడానికి సాధ్యమవుతుందని తెలిపారు. కావున త్వరగా మంత్రి, సీఎం. దృష్టికి తీసుకువెళ్లి గట్టు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను పూర్తి చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, అదనపు కలెక్టర్, అర్డిఎస్, నీటిపారుదల శాఖ అధికారులు, భూ సర్వే అధికారులు, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం

ముంబై,జూన్20రెండు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉన్న పావన్‌రాజే నింబాల్కర్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు ఈ కేసులో మహారాష్ట్ర మాజీ హోంమంత్రి, పద్మసింహ్ పాటిల్‌తో పాటు మొత్తం తొమ్మిది మందిని నిర్దోషులుగా ప్రకటించింది. దాదాపు 20 సంవత్సరాల పాటు సాగిన ఈ కేసులో 128 మంది సాక్షులను విచారించిన అనంతరం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. 2006 జూన్ 3న కాంగ్రెస్ నేత పావన్‌రాజే నింబాల్కర్ తన డ్రైవర్ సమద్ అబ్దుల్ వాహిద్ కాజీతో కలిసి ప్రయాణిస్తుండగా నవీ ముంబైలోని కలంబోలి ప్రాంతంలో దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నింబాల్కర్, ఆయన డ్రైవర్ మరణించారు. ఈ హత్యలకు రాజకీయ శత్రుత్వమే కారణమని దర్యాప్తు సంస్థలు అప్పట్లో వెల్లడించాయి. నింబాల్కర్‌ను రాజకీయంగా తొలగించేందుకు పద్మసింహ్ పాటిల్ కుట్ర పన్నారని, దానికి పలువురు సహకరించారని సీబీఐ పేర్కొంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఈ కేసులో తీర్పు వచ్చింది.. నిందితులపై అభియోగాలు నిరూపించేందుకు తగిన ఆధారాలు లేవని ప్రత్యేక సీబీఐ కోర్టు పేర్కొంది.

# 'సర్' కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్

మల్కాజిగిరి, జూన్ 20:ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. శనివారం నేరేడ్మెట్‌లోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమానికి సంబంధించిన బీఎల్ ఏ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన, 'సర్' ప్రక్రియకు సంబంధించిన ముఖ్యాంశాలను వివరిం చారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని కార్యకలా పాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు బూత్ లెవల్ అధికారుల (బీఎల్ ఓ) సమన్వయంతో పనిచేయాలని అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మల్కాజిగిరి డీసీ జకియా



సుల్తానా, మౌలాలి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దయానంద్, జగదీశ్వర్ రెడ్డి, మల్కాజిగిరి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నరసింహా రెడ్డి , యూసీడీ విభాగం డీపీఓ నిరూపమ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ యుబి పనులు వేగవంతం చేయాలి మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి



అల్వాల్, జూన్ 20: ఆర్ యుబి పనులను వేగవంతం చేయాలని అల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. శనివారం మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మచ్చ బొల్లారం జనప్రియ వద్ద జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్ యు బి) పనులను ఆమె, బిఆర్ఎస్ నాయకు లతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, పవన్, ఢిల్లీ పరమేష్, చరణ్ గిరి, రాజు, భాస్కర్ రెడ్డి శోభన్ బాబు లింగారెడ్డి సాజిద్, సరిత, వర్షా హరిత, తదితరులు పాల్గొన్నారు

# మల్కాజిగిరిలో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పర్యటన

మల్కాజిగిరి, జూన్ 20: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ శనివారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ఆయన వరద నీటి ముంపు ప్రాంతాలలో పర్యటించి, సమస్యలు గుర్తించి వర్షపు నీరు పారుదలకై ఏర్పాటు చేసిన డ్రైనేజ్ క్యాచ్ ఫిట్స్ ను పరిశీలించారు. బ్యూటీఫికే షన్ లో భాగంగా లాలాపేట ఫ్లైఓవర్ పై ఏర్పాటు చేస్తున్న పూల మొక్కల పనుల పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన, డిప్యూటీ డైరెక్టర్ యు బి డి వారికి తగు సూచనలు చేశారు. ప్రతిరోజు మొక్కలకు నీళ్లు ఏర్పాటు చేయాలని, ఫ్లైఓవర్ పై మధ్యలో ఏర్పాటు చేస్తున్న పూల కుండిలు కింద పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు సంబంధిత అధికారులు తనిఖీ చేస్తుండాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా లాలాపేట్ ఫ్లైఓవర్ ముందు సిఆర్పిఎఫ్ ఎదురుగా పెద్ద నీటి వరద కాలువలో ఇసుక తొలగింపు పనులను పరిశీలించారు. వర్షాకాలంలో మల్కాజిగిరి సర్కిల్లో 9 ముంపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలువకుండా, ఇండ్ల లోకి వరదనీరు వెళ్లకుండా పెద్ద నీటి కాలువలకు అనుసంధానం చేసే క్యాష్మెంట్ ఫిట్స్ ఏవిధంగా ఉన్నాయో



పరిశీలించారు. మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో ఉన్న 9 వర్షాకాలం వరదల ముంపు ప్రాంతాలను గుర్తించి 180 ఈస్ట్ ఆనంద భాగ్ డివిజన్ లోని సత్తిరెడ్డి కాలనీ, సత్య రాఘవేంద్ర కాలనీ, షిరిడి నగర్, రాజా నగర్, ఎం ఎం డి సి కాలనీ, 181 మిర్యాలగూడ డివిజన్ వెంకటాద్రి నగర్, 182 డివిజన్ జ్యోతి నగర్, 183 డివిజన్ నరసింహ రెడ్డి నగర్, ఆర్ యు బి ప్రాంతాలలో ప్రత్యేక డ్యూటీలు వేయడం జరిగిందని, అందు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, ఎస్ఎఫ్ఎ, వర్క్ ఇన్స్పెక్టర్, హైడ్రా విభాగం వారిని నియమించామని తెలిపారు. ఎట్టి పరిస్థితులలో వర్షాలకు కాలనీలు ముంపుకు గురి కాకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా జోనల్ పరిధిలో 5 సర్కిల్లో మాన్ సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం, హైడ్రా, డి ఆర్ ఎఫ్ ను ఏర్పాటు చేసి వాటర్ లాగిన్, విరిగిన చెట్లను తొలగించుట, డ్రైనేజీ ఓవర్ ఫ్లో, ఓపెన్ మాన్ హోల్స్ సమస్యలు ఉన్నట్లయితే రెస్క్యూ టిమ్ వారిని సంప్రదించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే మల్కాజ్గిరి సర్కిల్ కు పి. కపిల్ మార్షల్ ఫోన్ నెంబర్ 6281940294 లో సంప్రదిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి డీసీ జకియా సుల్తానా, డిప్యూటీ డైరెక్టర్ యు బి డిశ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లౌక్య, శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్,ఏఈదివ్యజ్యోతి, రజినీకాంత్ రమేష్ వర్క్ ఇన్స్పెక్టర్ నర్సింగ్ రావు జవాన్, హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

## నేరేడ్ మెట్ సీఐగా వెంకటయ్య బాధ్యతల స్వీకరణ




మల్కాజిగిరి, జూన్ 20 : నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా ఏ.వెంకటయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన సందీప్ కుమార్ సి పి ఆఫీస్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ వెంకటయ్య మాట్లాడుతూ..నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తా అన్నారు. ముఖ్యంగా ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కాలనీలలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు

# అయిజ పోలీస్ స్టేషన్‌కు రాజకీయ గ్రహణం

అయిజ జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ పట్టణ పోలీస్ స్టేషన్ రాజకీయ ఒత్తిళ్లకు వేదికగా మారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీస్ స్టేషన్‌కు రాజకీయ గ్రహణం పట్టిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం తరచూ సబ్–ఇన్‌స్పెక్టర్లు (ఎస్సైలు) మారడమే అని పట్టణ ప్రజలు అనుకుంటున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో ఆ నేత హవా..?అయిజ పోలీస్ స్టేషన్ పరిధిలో అలంపూర్ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ ముఖ్య నేత ఒకరు తెరవెనుక ఉండి మొత్తం చక్రం తిప్పుతున్నారనే టాక్ బలంగా వినిపిస్తోంది. సదరు నేత చెప్పినట్లే ఇక్కడ పోలీస్ యంత్రాంగం నడుచుకోవాలనే ఒత్తిళ్లు ఉన్నాయని, ఆ నాయకుడి కనుసన్నల్లోనే బదిలీల పర్వం సాగుతోందని నియోజకవర్గంలో ఇప్పుడు బహిరంగంగా చర్చ జరుగుతోంది. చెప్పినట్టు వినకపోతే వీఆర్‌కే..ఇక్కడికి వచ్చే అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు తీవ్రంగా ఉంటున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాము చెప్పినట్లు వినని అధికారులను లూప్ లైన్‌కు లేదా వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు పంపించడం, లేదంటే ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించడం సదరు నాయకులకు మంచినీళ్లు తాగినంత సులువుగా మారిందని విమర్శిస్తున్నారు. కీలుబొమ్మగా మారిన పోలీస్ వ్యవస్థ...ప్రజల్లో అసంతృప్తి..రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాలు , మితిమీరిన జోక్యం వల్ల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించాల్సిన పోలీస్ వ్యవస్థ, కొంతమంది చేతిలో కీలుబొమ్మగా మారుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారుల వరుస బదిలీల వల్ల స్థానిక సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, శాంతిభద్రతలపై దీని ప్రభావం పడుతోందని పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




# సినిమా

## మాఇంటి బంగారం ఓపెనింగ్ కలెక్షన్స్ అదుర్స్





సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ.6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ.10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ.90 లక్షలు, తమిళనాడులో రూ.38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2ఆ వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఇఖఎఖ ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'ఖుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి,శ్రీలక్ష్మి కీలక పాత్రల్లో నటించారు.


## అభిమానితో కలసి పుష్ప రీక్రియేట్ చేసిన అల్లు అర్జున్




లుకేమియాతో బాధపడుతున్న చిన్నారి శ్రద్ధ కోరికను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీర్చారు. మేక్-ఎ-విష్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఆమెను కలిసిన అల్లు అర్జున్, 'పుష్ప' సినిమాలోని పాపులర్ మూమెంట్స్‌ను ఆమెతో కలిసి రీక్రియేట్ చేశారు. ఈ హృదయాన్ని హత్తుకునే వీడియోను అల్లు అర్జున్ టీమ్ షేర్ చేయగా, సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వీడియోలో అల్లు అర్జున్ నవ్వుతూ హాయ్ శ్రద్ధా, ఎలా ఉన్నావ్? అని పలకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమాలోని ఐకానిక్ డైలాగ్ చెప్పమని ప్రోత్సహించారు. ఇద్దరూ కలిసి పుష్ప సిగ్నేచర్ బియర్డ్ స్ట్రోక్ చేయగా, అల్లు అర్జున్ చప్పట్లు కొడుతూ 'డ్యామ్ క్యూట్' అని మెచ్చుకున్నారు. చివరగా నువ్వు కోలుకున్న తర్వాత హైదరాబాద్‌కు రా అని చెప్పారు. ఏమవ్వాలనుకుంటున్నావ్ అని అడగగా, శ్రద్ధ డాక్టర్ అవ్వాలని ఉందని బదులిచ్చింది

## కాక్‌టెయిల్2 కుటుంబ కథా చిత్రం



షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2' . ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ.13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

## సోషియో ఫాంటసీగా నాగబంధం

### ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం




యువ నటుడు విరాట్ కర్ణ, గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పిసిఎక్స్ థియేటర్‌లో యూనిట్ సభ్యుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ అన్నీ తెలుగు సాంకేతిక నిపుణులే రూపొందించడం విశేషం. పురాతన ఆలయాలు, గ్రాఫిక్స్ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం మరియు చారిత్రక అంశాల నేపథ్యంలో మైథాలజీ అడ్వెంచర్ స్పెక్టకిల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో విరాట్ కర్ణ శివ తరహా మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. వీరితో పాటు ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జునైద్ కుమార్ మరియు అబీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు భారీ హైప్ తీసుకొచ్చింది.విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు గ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ప్రతి రూపాయి తెరపై స్పష్టంగా కనిపిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు మలయాళం, తమిళం, హిందీ భాషల్లో జూలై 03న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఫ్రెండ్స్ దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూత

హాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందిన 'ఫ్రెండ్స్', 'చీర్స్' వంటి ఐకానిక్ అమెరికన్ సిట్‌కామ్‌ల దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూశారు. 85 ఏళ్ల బరోస్ శుక్రవారం రాత్రి నిద్రలోనే ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఈ విషాద వార్త తెలియగానే హాలీవుడ్ పరిశ్రమతో పాటు 'ఫ్రెండ్స్' వెబ్ సిరీస్ నటీనటులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ తమ ప్రియమైన దర్శకుడికి నివాళులర్పించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన కెరీర్‌లో జేమ్స్
బరోస్ దాదాపు 1000కి పైగా టెలివిజన్ ఎపిసోడ్‌లకు దర్శకత్వం వహించి రికార్డు సృష్టించారు. 'ఫ్రెండ్స్'తో పాటు చీర్స్, ఫ్రేజియర్, విల్ అండ్ గ్రేస్, ది బిగ్ బ్యాంగ్ థియరీ, టూ అండ్ ఏ హాఫ్ మెన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కామెడీ షోలను ఆయన రూపొందించారు. తన అద్భుతమైన దర్శకత్వ ప్రతిభకు గానూ ఆయన ఏకంగా 11 ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డులను గెలుచుకున్నారు. జేమ్స్ బరోస్ మరణంపై 'ఫ్రెండ్స్' సిరీస్ నటులు డేవిడ్ శ్విమ్మర్, మాట్ లెబ్లాంక్, లిసా కుడ్రో సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'జిమ్మీ బరోస్ తాను పనిచేసిన ప్రతి నటుడిలోని ఉత్తమ ప్రతిభను బయటకు తీసేవారు. ఆయన కామెడీని మరింత నవ్వించేలా, ఎమోషన్‌ను మరింత హృదయానికి హత్తుకునేలా మార్చేవారు. ఆయన చూపించిన ఆప్యాయత మాకు ఒక కుటుంబంలాంటి సురక్షితమైన అనుభూతిని ఇచ్చింది' అని డేవిడ్ శ్విమ్మర్ భావోద్వేగంగా రాశారు.

## ఓటిటిలోకి అర్జున్ బ్లాస్ మూవీ

చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ
ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు.



# ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై సమగ్ర నివేదికలు అందించాలి

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నిజామాబాద్, జూన్ 20 :( విజన్ ఆంధ్ర ) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల వివరాలను పొందుపరుస్తూ ఆయా శాఖల వారీగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం అన్ని శాఖల అధికారులు, ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసిల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల నిర్వహణ తీరును పర్యవేక్షించి, తగిన దిశా నిర్దేశం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్లను నియమించిందని అన్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాకు స్పెషల్ ఆఫీసర్ గా నియమితులైన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, సీనియర్ ఐ.ఏ.ఎస్ డాక్టర్ యోగితారాణా త్వరలోనే జిల్లాకు విచ్చేసి ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలును సమీక్షించడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా శాఖల ఆధ్వర్యంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో, వార్డులు, మున్సిపల్ పట్టణాల వారీగా నిర్వహించిన గ్రామ సభలు, ఇతర కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ సోమవారం సాయంత్రం లోపు సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో నిర్దేశించిన అంశాలతో పాటు కొత్తగా వినూత్న రీతిలో ట్రాన్స్ జెండర్ల నిషేధంపై సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించడం, మారుమూల పల్లెలకూ ఆర్టీసీ బస్సు సర్వీసుల విస్తరణ, శ్రమదానం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు విస్తృత స్థాయిలో చేరవేసేందుకు సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల సేవలను వినియోగించుకోవడం వంటి వినూత్న కార్యక్రమాలను కూడా జిల్లాలో నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. వాటి వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రగతి ప్రణాళిక సభల నిర్వహణ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన అభ్యర్థనలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా వర్గాల వారికి చేకూర్చిన లబ్ధి గురించి నివేదికల్లో వివరాలు పొందుపరచాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.ఈ.ఓ అశోక్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- **అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి**
- **మధ్యాహ్నం 1.30 గంటల తరువాత లోనికి అనుమతి ఉండదు**
- **ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వెంట తెచ్చుకోవద్దు**
- **పునః నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**




నిజామాబాద్, జూన్ 20 :( విజన్ ఆంధ్ర) ఈ నెల 21న (ఆదివారం) జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్ననీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. నీట్ పరీక్ష పునః నిర్వహణ ఏర్పాట్లపై శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా నీట్ పరీషను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 3456 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఈ మేరకు జిల్లా కేంద్రంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నాగారంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల/కళాశాల, బోధన్ పట్టణంలో రైల్వే గేట్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో, డిచ్పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిల్డింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల బిల్డింగ్, మాక్లూర్ లోని శ్రీ బిగాల కృష్ణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామని అన్నారు. కాగా, అభ్యర్థులు పరీక్ష ప్రారంభం అయ్యే సమయానికి కనీసం అరగంట ముందే లోనికి చేరుకోవాల్సి ఉన్నందున, నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని అన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష హాల్ లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాలన్నారు. బయోమెట్రిక్ సమయంలో ఏదైనా సమస్య తలెత్తి ధృవీకరణ పూర్తి కాకపోయినా, అభ్యర్థులను పరీక్షా గదిలోకి ప్రవేశించడానికి అనుమతిస్తారని, అయితే అభ్యర్థులు లిఖితపూర్వక హామీ పత్రాన్ని సమర్పించాలని, హామీ పత్రం నమూనా పరీక్షా కేంద్రంలో అందించబడుతుందని తెలిపారు. అభ్యర్థులు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలైన మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబడవని అన్నారు. అన్ని కేంద్రాలలో తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందని, పకడ్బందీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని, కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కాగా, నీట్ పరీక్ష రోజున రోజున అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు ఉండే అవకాశం ఉన్నందున విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలని అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలేకు సూచించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశ్నాపత్రం, సమాధాన పత్రాల తరలింపునకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 164 (బీఎన్ఎస్) నిషేధాజ్ఞలు అమలు చేస్తూ, జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్ష సమయాలకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడపాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరీక్షా కేంద్రాల నోడల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యున్నత వైద్యం అందించేలా చర్యలు

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,జూన్ 20,(విజన్ ఆంధ్ర); జిల్లాలోని పేద ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం ఆయన నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్సల కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగాన్ని పరిశీలించిన ఆయన, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు కర్మాగార నిర్మాణ పనులకు త్వరలో ముహూర్తం

- **జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి**
- **జేఎస్ డబ్ల్యూ గ్రూప్స్ ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన**



జమ్మలమడుగు,జూన్ 20 (విజన్ ఆంధ్ర): రాయలసీమ ప్రజల కల నెరవేర్చే దిశగా. అతి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనుల ప్రారంభానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని సున్నపురాళ్ళ పల్లె వద్ద జేఎస్ డబ్ల్యూ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉక్కుకర్మాగారం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్న ప్రాంతాన్ని.శనివారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆ కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో ఈ ప్రాంతవాసుల కలను సాకారం చేసే దిశగా అతి త్వరలోనే ఉక్కు కర్మాగార నిర్మాణం తొలిదశ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే దిశగా ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. సంబంధిత సన్నాహక ఏర్పాట్లలో భాగంగా.ముఖ్యమంత్రి రాక కోసం ప్లాంట్ సైట్ ప్రాంతంలోని హెలిపాడ్ల స్థితిగతులను, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని రకాల మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలకు సంబంధించి జిల్లా ఎస్పీ, జేఎస్ డబ్ల్యూ యాజమాన్య ప్రతినిధులు, సంబందిత అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు.ఈ కర్మాగారం నిర్మాణం కార్యరూపం దాల్చితే.. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వడం, వేలాది మంది యువతకు మెండైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్డబ్ల్యూ స్టీల్స్ ప్లాంట్ హెడ్,సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ పూరి, బిజినెస్ హెడ్ వైస్ ప్రెసిడెంట్ యోగేష్ బేడీ, టెక్నికల్ హెడ్ పురుషోత్తం ప్రసాద్, లైజనింగ్ కార్పోరేట్ హెడ్ కనకరావు, హెచ్ఆర్ హెడ్ ఏ. సుదర్శన్, ప్రాజెక్టు హెడ్ షేక్ నూరుల్, ఆర్డీవో శిరీష, ఎపి ఐఐసి జెడ్ఎం శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా,రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ట్రాఫిక్ వింగ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు




గద్వాల జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు శనివారం గద్వాల టౌన్ ట్రాఫిక్ వింగ్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ వింగ్ పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం ట్రాఫిక్ సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి బాధ్యతలు, రోజువారీ విధుల గురించి ఆరా తీశారు.ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బాలచంద్రుడిని రోజువారీ డ్యూటీల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ట్రాఫిక్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ట్రాఫిక్ పోలీసుల ఆటిట్యూడ్, బాడీ లాంగ్వేజ్, యూనిఫాం ధరించే తీరు (నీట్ టర్నౌట్), క్రమశిక్షణ నేరుగా పోలీస్ శాఖ ప్రతిష్ఠను ప్రతిబింబిస్తాయని అన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, కమిట్‌మెంట్‌తో విధులు నిర్వర్తించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ వింగ్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన ట్రాఫిక్ పాయింట్లలోనే అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రిస్తూ, రోడ్డు వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, ట్రాఫిక్ వింగ్ ఆర్.ఎస్.ఐ. బాలచంద్రుడు, ట్రాఫిక్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవకు గుర్తుగా బిఎస్ నారాయణరెడ్డి కి గౌరవ డాక్ట రేట్




బద్వేలు, జూన్ 20: (విజన్ ఆంధ్ర)తమిళనాడు రాష్ట్రం పర్యాటక కేంద్రమైన ఊటీ నగరంలో జిమ్ పార్క్ హోటల్ ఊటి శద్దన్ రోడ్ నీలగిరిష్ నందు గౌరవ అతిథులు ప్రెసిడెంట్ డా!!కిమ్ డాక్టర్!!ఏ గోపికృష్ణ గౌ రిజిస్ట్రార్ యస్ ఏ వై యు/ యు ఎన్ ఐ పి సి, చీఫ్ జడ్జెస్ డా ఏ ప్రభు రాజేంద్రన్ చీఫ్ డైరెక్టర్ సౌత్ ఇండియా యు ఎన్ ఐ పి సి, సందీప్ ఐపీఎస్ కస్టమ్స్ ఆఫీసర్ తమిళనాడు, ప్రొ డా!!ఎస్ చల్లదురై ఫార్మర్ శానిటర్ భారతీయార్ యూనివర్సిటీ కోయంబత్తూర్, ప్రొ డా ఎస్ బాలమురుగన్ హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ కోయంబత్తూర్ డాక్టర్ ఎం ఖాదరవలి నేషనల్ ప్రెసిడెంట్ నేషనల్ రైట్స్ ఆర్గనైజేషన్ హెచ్ ఈ ఏ ఎం బి, డాక్టర్ ఆర్ సురేష్ బాబు డాక్టర్ యు.ఎన్.ఐ.పి.సి కోఆర్డినేటర్ చేతుల మీదుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు డాక్ట రేట్ అందుకున్నారు. అనంతరం బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు మాట్లాడుతూ చిన్నప్పటినుండి సామాజికంగా సేవ చేయాలనే తపన నాలో ఎంతో ఎక్కువ ఉండేదన్నారు అంతే ఉత్సాహంతో సేవా కార్యక్రమాల్ని ముందుకు సాగిస్తున్నానన్నారు. చాలా ఇష్టమైనటువంటిది గర్వంగా నేను చేసే పని అనాధ శవాలకి అంత్యక్రియలు నిర్వహించడం పేదల కోసం మిగులు భోజనం ఏర్పాటు చేయడం ప్రతి మనిషి కూడా గర్వంగా ఉండాలని ఆపదలో ఉన్న సమయంలో నేనున్నాను నేను సైతం అంటూ అవ్వ తాతలకి తల్లిదండ్రులు చనిపోయిన బిడ్డలకి ఏదో ఒక రకంగా దాతల సహాయంతో వారికి సహాయపడుతూ ప్రతి సోమవారం గిద్దలూరులో కాశినాయన దగ్గర ప్లాస్టిక్ రహిత భోజనం ఏర్పాటు చేయడం వాటితో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నందున నాకు రాజధాని అమరావతి తుళ్లూరు వడ్డమాను కు చెందిన ఆకృతి ఎస్ ఎస్ ఎఫ్ చైర్మన్ కటారి రమాదేవి జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ వారు మీకు గౌరవ డాక్టరేట్ ఇస్తున్నారని ఫోన్ ద్వారా తెలపగా చాలా ఆనందమేసింది ఆమెకి హృదయపూర్వకంగా అలాగే యూనివర్సిటీ వారికి కూడా మా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ తరపున కృతజ్ఞతలు తెలియజేసు కుంటున్నామని అవార్డ్ గ్రహీత బి యస్ నారాయణరెడ్డి తెలిపారు ఈ డాక్టరేట్ మా గురుదేవులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక గురువు పరమ పూజ్య శ్రీ శ్రీ రవి శంకర్ గురూజీకి మా తల్లిదండ్రులకు నాకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న గౌరవ పెద్దలకు అన్న తమ్ముల్లకు మా బిడ్డలకి తోటి ఏ ఓ ఎల్ టీచర్స్ కి అంకితమిస్తున్నామని బి యస్ నారాయణ రెడ్డి తెలిపారు.

# క్రైస్తవులు, ముస్లింలకు ఎస్సీ హోదా కల్పనను వ్యతిరేకిస్తూ 59 ఎస్సీ ఉపకులాల రౌండ్ టేబుల్ సమావేశం




మహబూబ్‌నగర్ అర్బన్ జూన్ 20 (విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో తెలంగాణ హిందూ దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 59 ఎస్సీ ఉపకులాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ హోదా వర్తించదని ఇచ్చిన తీర్పును సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు స్వాగతించారు. మత మార్పిడి పొందిన క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తే నిజమైన హిందూ దళిత సమాజం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే మందకృష్ణ మాదిగ, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, కడియం కావ్య ఎంపీ, కొప్పుల ఈశ్వర్‌తో పాటు కొందరు క్రైస్తవ మత గురువులు ఢిల్లీలోని బాలకృష్ణ కమిషన్‌కు మత మార్పిడి పొందిన క్రైస్తవులు, ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని వినతిపత్రాలు సమర్పించడాన్ని సమావేశం ముక్తకంఠంతో ఖండించింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ హిందూ దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ పరిగి రామన్న, మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ యాంకి రమేష్, తిరుపతయ్య, ఎస్సీ కార్పొరేషన్ భూముల పరిరక్షణ కమిటీ చైర్మన్ పాతపాలమూర్ కొండయ్య, ఆర్ఆర్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్, సింగిరెడ్డి పరమేశ్వర్, డాక్టర్ నాగయ్య, పోలెల రాందాస్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సిములు, అరుంధతి బంధు సేవా సంఘం అధ్యక్షుడు జుట్ల హన్మంతు, ఎరుకల సంఘం నాయకులు లాల్‌కోట శ్రీనివాస్, రాములమ్మ, శ్రీవల్లి, రాధ, పాతూర్ రమేష్, కొప్పుల శ్రీనివాస్, శ్రీరాములు, బండారి రాములు, బాలకృష్ణ, ఆర్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# విశేషంగా ఆకట్టుకున్న 'భక్తి గీతాలు', 'భజన కార్యక్రమం', 'రుబాయిల గానం'







హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ విశ్వనాథ్ ) : తెలంగాణ సంస్కృతిని, కళలను భావితరాలకు అందించే లక్ష్యంతో సాగుతున్న సుదీర్ఘ తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భజన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రవీంద్రభారతి లోని "పాల్కురికి సోమన్న మూల" వేదికపై 78వ రోజు నిర్వహించిన భజన కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ కళాకారులు ఇద్రిస్ బృందంచే జానపద, భక్తి గీతాలు, సుదర్శనం శ్రీనివాస్ బృందంచే భజన గీతాలు, కళాకారులు అందించిన భజన ప్రదర్శన ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఇద్రిస్ బృందం ఆలపించిన జానపద, భక్తి గీతాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. తమదైన శైలిలో సాగిన వీరి గానం వేదికకు ప్రత్యేక శోభను తెచ్చింది. అలాగే సుదర్శనం శ్రీనివాస్ బృందం సమర్పించిన భజన కీర్తనలు, కళాకారులు ప్రదర్శించిన సాంప్రదాయ భజన కీర్తనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. 79వ రోజు నిర్వహించిన గీతాలు, తెలంగాణ రుబాయిలో కొన్ని చరణాలు కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ కలకారులు భాస్కర శర్మ బృందంచే భక్తి గీతాలు, అలాగే కుమారి క్యాదాసి సంధ్యారాణి బృందంచే భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి పుస్తకం తెలంగాణ రుబాయిలో కొన్ని చరణాలు వినిపించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భాస్కర శర్మ బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించాయి. సుమధుర కంఠస్వరంతో కళాకారులు పాడిన కీర్తనలు సభలోని వారిని భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి, రచించిన 'తెలంగాణ రుబాయిలు' పుస్తకంలోని కొన్ని విశిష్టమైన రుబాయిలను (పద్య పాదాలను) కుమారి క్యాదాసి సంధ్యారాణి బృందం అద్భుతంగా గానం చేసి తెలంగాణ సంస్కృతిని, మట్టి వాసనలను, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ రుబాయిల గానం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. కళాకారుల అభినయం, గాన మాధుర్యంతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. 80వ రోజు నిర్వహించిన భక్తి గీతాల కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. వీరేష్ బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించాయి. సుమధుర కంఠస్వరంతో వారు పాడిన కీర్తనలు సభలోని వారిని భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. గాన మాధుర్యంతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు.

# పీజీ సెంటర్ లో విజయవంతమైన ఉద్యోగమేళ



గద్వాల జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో శనివారం అన్నపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ ఉద్యోగాల మేళాలో ఎంబీఏ, ఎం కామ్ డిపార్టుమెంటు విద్యార్థులు దాదాపుగా 25 మంది పాల్గొనగా, వీరిలో 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపిక కాని విద్యార్థులు నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో శ్రమిస్తే మరిన్ని అవకాశాలు వస్తాయని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. రాబోయే కాలంలో మరిన్ని కంపెనీలు, సంస్థలు ఉద్యోగాల నియామకాల కోసం పీజీ సెంటర్ కు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ అధ్యాపకులు డాక్టర్ రవి షరీన్, ఎండి రఫీ, ఎం.కామ్ అధ్యాపకులు వంగూరి గణేష్, డాక్టర్ కే మహేందర్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కీప్ రాకింగ్ కలెక్టర్ సాబ్!!

- పెద్దపల్లి టూ హైదరాబాద్
- అక్షరాల వెలుగుల్లో 'శ్రీహర్ష' విద్యా విప్లవం!
- సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సన్మానం
- ఎల్బీ స్టేడియం వేదికగా 'పెద్దపల్లి' మార్క్




పెద్దపల్లి జిల్లా బ్యూరో, జూన్ 20 (విజన్ ఆంధ్ర ) : ఒక సమర్థుడైన అధికారి తలచుకుంటే వ్యవస్థ రూపురేఖలు ఎలా మారతాయో, ఒక వెనుకబడిన ప్రాంతం ప్రగతి పథంలో ఎలా దూసుకుపోతుందో నిరూపించారు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష. విద్యా ప్రమాణాల




పెంపులో, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలోనే నెంబర్ 1 స్థానంలో నిలిపి సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ అసాధారణ విజయానికి గుర్తింపుగా శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. వేలాది మంది సమక్షంలో, ఉద్వేగభరిత వాతావరణంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్ ని ప్రత్యేకంగా అభినందిస్తూ సన్మానించిన ఆ క్షణం.. పెద్దపల్లి జిల్లా చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. ఈ అవార్డు కేవలం ఒక అధికారికి దక్కిన గౌరవం కాదు, జిల్లాలోని ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడి కష్టానికి దక్కిన ప్రతిఫలం. ఈ సీన్ చూసి జిల్లా ప్రజల గుండె గర్వంతో ఉప్పొంగింది.

**కలెక్టరేట్‌లో ఆత్మీయ సత్కారం**
**ప్రభుత్వ విప్ విజయరమణ రావు 'కంగ్రాట్స్'**

హైదరాబాద్‌లో అవార్డు అందుకుని సగర్వంగా శనివారం నాడు జిల్లాకు చేరుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్షకి కలెక్టరేట్ కార్యాలయంలో అత్యంత ఘనస్వాగతం లభించింది. పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు కలెక్టరేట్‌కు విచ్చేసి కలెక్టర్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆఫీస్‌లో ఒక భావోద్వేగ, ఆత్మీయ వాతావరణం చోటుచేసుకుంది. కలెక్టర్ సేవలను కొనియాడుతూ ప్రభుత్వ విప్ విజయరమణ రావు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాకు ఇంతటి కీర్తి తెచ్చిన అధికారిని అభినందించడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని సెంటిమెంట్‌తో కూడిన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్ సాబ్.. మీ వర్క్ స్టైల్ సూపర్! మీ నిబద్ధత, విద్యా వ్యవస్థపై మీకున్న విజన్ ఈ రోజు మన జిల్లా కాలర్ ఎగరేసేలా చేశాయి. ఒక ప్రజాప్రతినిధిగా మాకెంతో గర్వంగా ఉంది. అవార్డు రావడం ఒక ఎత్తు అయితే.. దాన్ని నిలబెట్టుకుంటూ రానున్న రోజుల్లో పెద్దపల్లి జిల్లాకు మరిన్ని స్పెషల్ రికార్డులు, గుర్తింపులు తెచ్చేలా మీ స్పీడ్ కంటిన్యూ చేయాలి. జిల్లా ప్రగతికి, ప్రతి మంచి అడుగుకు ప్రజాప్రతినిధులుగా మా పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. అని తెలిపారు.

**న్యూ ఏజ్ అడ్మినిస్ట్రేషన్..**
**లీడర్ విజన్ + ఆఫీసర్ యాక్షన్!**

పాత పద్ధతులకు, కేవలం ఏసీ రూంలకే పరిమితమయ్యే ఫైళ్ల పాలనకు చెక్ పెడుతూ.. నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి, ప్రభుత్వ బడులను సందర్శిస్తూ రిజల్ట్స్ రాబట్టిన కలెక్టర్ శ్రీహర్ష 'మోడర్న్ థింకింగ్' ఇప్పుడు స్టేట్ వైడ్‌గా టాక్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్ అయింది. మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ విజయరమణ రావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ లాంటి ప్రజాప్రతినిధుల మద్దతు, కలెక్టర్ లాంటి డైనమిక్ ఆఫీసర్ యాక్షన్ తోడైతే సక్సెస్ ఎలా ఉంటుందో పెద్దపల్లి నిరూపించింది. రాబోయే రోజుల్లో ఈ టీం జిల్లాను మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కీప్ రాకింగ్ కలెక్టర్ సాబ్! మీ లీడర్‌షిప్‌లో పెద్దపల్లి ప్రగతి రథం ఇలాగే దూసుకుపోవాలని జిల్లా ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు.

# మఫ్టీ లో మన మధ్యే..!!

## మానుకోటలో ఎస్పీ శబరీష్ న్యూ ట్రెండ్ పోలీసింగ్...!!!



మహబూబాబాద్ బ్యూరో , జూన్ 20 (విజన్ ఆంధ్ర ) : గంజాయి, మత్తుపదర్థాల, అక్రమరవాణా, వినియోగ నివారణ కోసం స్వయంగా రంగంలోకి దిగిన ఎస్పీ డాక్టర్ శబరీష్...!! చీకటి వ్యవహారాలను బట్టబయలు చేసేందుకు రాత్రి వేళలో మఫ్టీలో.., రద్దీ ప్రాంతాల్లో సామాన్య యువకునిలా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, పోలీస్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. మహబూబాబాద్ టౌన్ సిఐ రఘుపతిరెడ్డి తో కలిసి సామాన్య పౌరుని లాగా మహబూబాబాద్ పట్టణంలో ప్రదాన కూడల్లలో ఎస్పీ శబరీష్ కలియతిరిగారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం తోపాటు.., జిల్లా వ్యాప్తంగా ఇదే తరహా నిఘా కొనసాగుతోంది. మానుకోట ప్రజలారా...!! కనిపించని నాలుగవ సింహం మన..మద్యే.., మనతోపాటే కలిసి తిరుగుతుంటాడు..!!, చట్టవ్యతిరేక శక్తులకు చుక్కలు చూపిస్తారు.., హద్దుమీరితే ఏడు ఊచలు లెక్కపెట్టేలా చేస్తారు. తస్మాత్ జాగ్రత్త..!!

# పరేడ్ గ్రౌండ్ యోగాలో పాల్గొన్న ప్రముఖులు

హైదరాబాద్,జూన్20 : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సినీ నటులు నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి తదితరులు పాల్గొని యోగా సాధన చేశారు. ఏటా మాదిరిగానే యోగా కార్యక్రమం నిర్వహించినట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నిత్యం యోగా చేయడం వల్ల రుగ్మతల బారిన పడకుండా ఉండొచ్చని తెలిపారు.

# రాఘవేంద్ర కాలనీ ప్రజలకు చెత్త డంపింగ్ యార్డ్ సమస్యపై ఊరట

## విజన్ ఆంధ్ర న్యూస్ కు స్పందించిన మున్సిపల్ సిబ్బంది




గద్వాల జూన్ 20 (విజన్ ఆంధ్ర బ్యూరో) : గద్వాల పట్టణంలోని 9వ వార్డు రాఘవేంద్ర కాలనీ సమీపంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలపై ఇటీవల సోషల్ మీడియాలో శనివారం వచ్చిన విజన్ ఆంధ్ర వార్తాపత్రికలో ప్రచారమైన వార్త వైరల్ కావడంతో మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. కాలనీవాసుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటేషన్ సిబ్బంది ప్రత్యేకంగా రంగంలోకి దిగి డంపింగ్ యార్డ్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, శుభ్రపరిచే పనులు చేపట్టడం, దుర్వాసన నివారణకు చర్యలు చేపట్టడం జరిగింది. దీంతో కాలనీ ప్రజలు కొంత మేర ఊరట పొందారు. విజన్ ఆంధ్ర యజమాన్యం కు,సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులను స్థానికులు అభినందించారు. ముఖ్యంగా ఎండలను లెక్కచేయకుండా ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రమించిన శానిటేషన్ సిబ్బందికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను విజన్ ఆంధ్ర వార్తాపత్రిక ద్వారా వెలుగులోకి తీసుకురావడం, వాటిపై అధికారులు సత్వర చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సానుకూల పరిణామమని స్థానికులు పేర్కొన్నారు. రాఘవేంద్ర కాలనీ ప్రజల సమస్యను గుర్తించి స్పందించిన మున్సిపల్ అధికారులకు, అంకితభావంతో పనిచేసిన శానిటేషన్ సిబ్బందికి, విజన్ అంధ్ర వార్తాపత్రిక ప్రతినిధికి, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 30 తేదీన రైతు సమ్మేళన సభకు ఖమ్మం జిల్లాకు రానున్న సీ.ఎం రేవంత్ రెడ్డి.

పాల్వంచ ప్రతినిధి జూన్ 20(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా పథకం తెలంగాణ రైతులకు వరమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు.అన్నారు. రైతులకు వానాకాలం సాగు పెట్టుబడి నిమిత్తం 9000 కోట్ల భారీ బడ్జెట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాలోని మధిర నియోజకవర్గం లో రైతు భరోసానిధులను విడుదల చేయనున్నారని అన్నారు. దీనితో రాష్ట్రంలోని 73 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు ప్రతి ఎకరానికి 6000 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించి రైతాంగాన్ని ఆదుకుంటున్నదని లికొత్వల అన్నారు. రైతు భరోసాతో పాటు సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్, వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం మద్దతు ధర వంటి రైతు సంక్షేమ పథకాలు చేపడుతూ రైతాంగాన్ని ఆదుకుంటున్నదని కొత్వాలన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలి.

రైతు భరోసాపథకం ప్రారంభానికి ఈనెల 30 వ తేదీన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం వస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి రైతులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని కొత్వాలకోరారు.

# బొగ్గు గని గుండెల్లో & 'కవిత' బాయి బాట!!

- సింగరేణి నల్ల బంగారం సాక్షిగా & కరిగిపోయిన కష్టాల గోడు
- వారం రోజుల యాత్ర గ్రాండ్ సక్సెస్
- సింగరేణిని కదిలించిన 'కవితమ్మ' ఎమోషనల్ కనెక్ట్!
- క్షేత్రస్థాయిలో చెమటోడ్చిన రియాజ్ అహ్మద్, మనోజా గౌడ్
- తెలంగాణ రక్షణ సేనకు, కవిత భరోసాకు నీరాజనాలు




**హైదరాబాద్, జూన్ 20:**
అది కేవలం ఒక పర్యటన కాదుడ నల్లబొగ్గు పొరల వెనుక దాగున్న కార్మిక గుండెల ఆలాపన. సింగరేణి గనుల సాక్షిగా తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమం కేవలం సక్సెస్ మాత్రమే కాదుడ కార్మికుల గుండెల్లో ఒక కొత్త ఆశల దీపాన్ని వెలిగించింది. వారం రోజుల పాటు సాగిన ఈ సుదీర్ఘ ప్రయాణం, తెలంగాణ రక్షణ సేనగా కార్మికులకు అండగా నిలిచిన తీరు ఇప్పుడు సింగరేణి వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.




**కన్నీటి కథలు & కవితమ్మ ఓదార్పు!**

నల్లటి బొగ్గు గనుల్లో రక్తాన్ని చెమటగా మార్చే కార్మికులు, తమ కష్టాలను, ఏళ్ల తరబడి వేధిస్తున్న గోడును కవితమ్మ ముందు వెళ్లబోసుకున్నారు. అమ్మాడ మా బతుకులు ఈ చీకటి గనుల్లోనే కరిగిపోతున్నాయి అంటూ ఒక వృద్ధ కార్మికుడు ఆవేదన చెందుతుంటే, కవిత కేవలం ఒక నాయకురాలిగా కాకుండా, ఒక కన్నకూతురిగా మారి వారి చేతులు పట్టుకుని ఓదార్చిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. సెంటిమెంట్‌తో కూడిన ఈ భావోద్వేగ దృశ్యాలు 'బాయి బాట'కు ఒక ఎమోషనల్ టచ్ ఇచ్చాయి.

**ది గ్రాండ్ సక్సెస్ ఫార్ములా (100% పాస్ రిపోర్ట్)**

ఈ వారం రోజుల కార్యక్రమం ఇంతటి భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం వెనుక తెరవెనుక ఇద్దరు వ్యూహకర్తల కష్టం స్పష్టంగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో వారు వేసిన అడుగులు, ఈ ప్రోగ్రామ్‌ను సూపర్ హిట్ చేశాయి. రియాజ్ అహ్మద్ హెచ్ఎంఎస్ నాయకులుకార్మిక శ్రేణులను ఏకం చేయడం, క్షేత్రస్థాయి సమస్యలను కవితమ్మ దృష్టికి తీసుకెళ్లడం. పడాల మనోజా గౌడ్ టిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు మహిళా కార్మికుల భాగస్వామ్యం, పర్యటన రూట్ మ్యాప్, పకడ్బందీ ఏర్పాట్లు. ఈ ఇద్దరు నాయకుల సమన్వయం, కష్టానికి రాజకీయ విశ్లేషకులు '100కి 100 మార్కులు' (ఫుల్ పాస్ రిపోర్ట్) ఇస్తున్నారు. వీరి ప్లానింగ్ వల్లే ప్రతి గని వద్ద జనసందోహం వెల్లువెత్తింది.

**మోడర్న్ స్టైల్ కనెక్టివిటీ & సోషల్ మీడియా షేక్స్!**

ఈ 'బాయి బాట' కేవలం సాంప్రదాయ సభలకే పరిమితం కాలేదు. పూర్తి మోడర్న్ స్టైల్‌లో, కార్మికులకు భరోసా నేపథ్యంలో సాగింది. గని కార్మికులతో కవిత నేరుగా కూర్చొని చాయ్ తాగుతూ మాట్లాడిన ముచ్చట్లు డిజిటల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. సామాన్యులతో సైతం చాయ్ పే చర్చ నిర్వహించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. మాట్లాడిన తీరు, ఇచ్చిన భరోసా సైతం వారికి కొత్త ఆశలను రేకెత్తించినది.

**తెలంగాణ రక్షణ సేనకు నీరాజనాలు**


కార్మికుల హక్కుల కోసం పోరాడే తెలంగాణ రక్షణ సేనకు సింగరేణి లోయ అంతటా జైజైధ్వానాలు మిన్నంటాయి. బాట ముగిసిందిడ కానీ భరోసా మొదలైంది! వారం రోజుల కవితమ్మ 'బాయి బాట' ముగిసి ఉండవచ్చు. కానీ, సింగరేణి కార్మికుల గుండెల్లో ఒక నమ్మకం మాత్రం గట్టిగా నాటుకుంది. తమ సమస్యల చీకట్లను చీల్చేందుకు కవితమ్మ రూపంలో ఒక వెలుగు రేఖ వచ్చిందనే ఆనందం ప్రతి కార్మిక కుటుంబంలో కనిపిస్తోంది. మొత్తానికి ఈ కార్యక్రమం సింగరేణి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# గూగుల్ జాబితాలో చోటు దక్కించుకున్న పిల్లల తిరుపతి సంతకం..



కాగజ్ నగర్, జూన్ 20 (విజన్ ఆంధ్ర) : కొమరం భీం జిల్లా దహేగం మండలంలోని కొత్మీర్ గ్రామానికి చెందిన పిల్లల తిరుపతి అద్భుతమైన సంతకానికి గూగుల్ జాబితాలో చోటు దక్కటం అభినందనీయం అని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రతి మనిషికి కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. అలాగే భారతదేశంలో అత్యున్నతమైన సంతకంగా పిల్లలు తిరుపతి సంతకం



ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సంతకంలో ప్రత్యేకత ఏమిటంటే తిరుపతి పేరుతో పూర్తి సంతకం ఉంటుంది. ప్రపంచంలోనే ఇలాంటి సంతకాలు చాలా అరుదు. భారతదేశంలో ఇలాంటి సంతకం ఉండటం, అదీ పిల్లల తిరుపతి లాంటి మనిషి ఈ దేశంలో పుట్టడం మనం గర్వించదగ్గ విషయమని పలువురు వక్తలు ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తిరుపతి తెలంగాణలోని సిర్పూర్ నియోజకవర్గం దహేగం మండలం కొత్తిమీర కు గ్రామంలో జన్మించడం అందరికి గర్వకారణం అని అక్కడి ప్రజలు కొనియాడుతున్నారు.

# పర్మిషన్ లేకుండా నడుపుతున్న స్కూల్ లపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- పల్లగొర్ల మోదీరాందేవ్**



చౌటుప్పల్ : విచ్చలవిడిగా పర్మిషన్ లేకుండా స్కూలు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటలాడుతున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలన్నారు బీసీ సంఘం నాయకులు చౌటుప్పల్ టౌన్ లో ఉన్న ట్రినిటీ విద్యాసంస్థలు 1స్కూలుకు పరిమిషన్ ఉంటే 3 స్కూలు నడుపుతున్నారు పర్మిషన్ లేకుండా క్లాసులు నిర్వహిస్తున్నారు ఏదే ఇచ్చాక పుస్తకాలు అమ్ముతున్నారు ట్రినిటీ విద్యాసంస్థ యజమాన్యం,, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తే నా ఎనక అధికారులు ఉన్నారు పర్మిషన్ లేకుండా స్కూల్ నడుపుతా అంటున్నారు ట్రినిటీ స్కూల్ యజమాన్యం ఫీజుల పేరుతో విద్యార్థుల రక్తం తాగుతున్నారు ఇదే విషయంపై ఇజుూ గారికి బీసీ సంఘం నాయకులు విషయం తెలియజేస్తే వీజుూ గురువయ్య వారి బృందాన్ని పంపి పర్మిషన్ లేని ట్రినిటీ స్కూల్ ను అందులో దొరికిన బుక్స్ ను సిజ్ చేశారు సీల్ విధించడం జరిగింది లిబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాం దేవ్ యాదవ్ మాట్లాడుతూ



ప్రవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల రక్తం తాగుతు న్నారు పర్మిషన్ లేకుండా విద్యార్థుల జీవితాలతో ఆటలాడు తున్నాయి ప్రవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నామ్స్ ప్రకారం పర్మిషన్ లేకుండా, బిల్డింగ్ సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండా శానిటైజర్ మరియు ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకుండా ఇదేచ్ఛగా పుస్తకాలను ఫిట్నెస్ లేని బతుకు నడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రవేట్ స్కూల్లు ఆటలాడుతున్నాయా బుక్ ఫీజ్ అని బడి ఫీజు అని బస్సు ఫీజు అని ట్యూషన్ ఫీజ్ అని డొనేషన్ ఫీజ్ అని ప్రైవేట్ విద్యాసంస్థలు దోచుకుంటున్నారు స్కూల్లో ఎలాంటివి అమ్మొద్దని గైడ్లైన్స్ ఉన్న అవి పెడచెవినపెట్టి కాయ కష్టం చేసి సంపాదించుకున్న పేదల సొమ్మును దోచుకుంటున్నారు 2005 ఫీజు నియంత్రం చట్ట అమలులో ఉన్న అవన్నీ పట్టించుకోకుండా విద్యార్థుల రక్తం తాగుతున్నారు అలాంటి ప్రైవేట్ విద్యాసంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నియమించి ప్రభుత్వ స్కూల్లో మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు తీసుకొచ్చి పేద విద్యార్థుల కు న్యాయం చేయాలని కోరారు లిఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎష్ట్ర మనీల్, ఎడ్ల మహాలింగం, నిరంజన్ గౌడ్ , మల్లయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగ రావు



అయిజ జూన్ 20 (విజన్ ఆంధ్ర ) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వేణిసోంపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) నర్సింగ రావు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి, కూలీల హాజరు, మస్టర్ రోల్స్‌ను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో నేరుగా మాట్లాడిన అడిషనల్ కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనిదినాలు, కూలీ డబ్బుల చెల్లింపులు, పని ప్రదేశంలో సౌకర్యాలపై ఆరా తీశారు. సర్పంచ్ బి. శంకరమ్మ కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. భాస్కర్ యాదవ్, ఏపీఓ రాజేష్ లాలు నాయక్, ఎంపీఓ కే.నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ సునీల్ కుమార్, ఉపాధి కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.